

రంగారెడ్డి । వికారాబాద్ । మేడ్చల్

వార్త

## డబుల్ రిజిస్ట్రేషన్ చేస్తున్నారంటూ పురుగుల మందుతో వ్యక్తి హల్ చల్

**-కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామన్న తహసీల్దార్ గోవిందమ్మ**

**యాలాల డిసెంబరు 8,ప్రభాతవార్త :** యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబరు 9,11లలో గల 3.12 ఎకరాల భూమినిరిజిస్ట్రేషన్‌ను నిలిపివేయాలని గురువారం యాలాల మండల తహశీల్దార్ కార్యాలయంలో ఓ వ్యక్తి పురుగుల మందు సేవిస్తానంటూ హల్‌చల్ చేశారు.ఈ సర్వే నంబర్లలో గల భూమిని తాండూరు పట్టణానికి చెందిన ఓ వ్యాపారికి అధికారలు డబుల్ రిజిస్ట్రేషన్ చేయడం నిలిపివేయాలని వెంకటమ్మ అనే దళిత మహిళ తహశీల్దార్ గోవిందమ్మ ముందు మొర పెట్టుకున్నారు.కోర్టు వివాదంలో ఉన్న తన పొలాన్ని రెవెన్యూ అధికారులు వ్యాపారితో కుమ్మక్కై డబుల్ రిజిస్ట్రేషన్ చేసేందుకు సిద్ధం అయ్యారని వారు ఆరోపించారు.తమ భూమి తమకు దక్కేలా అధికారులు సహకరించాలని వారు కోరారు.పై సర్వే నంబర్లలో గల భూమినిఎవరికీ రిజిస్ట్రేషన్ చేయరాదని వారు తహశీల్దార్‌కు విన్నవించారు.ఇదే విషయమై తహశీల్దార్ గోవిందమ్మను వివరణ కోరగా ఈ భూమికి సంబంధించిన వివరాను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.

## ప్రజలు లేక ఆత్మీయ సమ్మేళనం రద్దు

**బషీరాబాద్,డిసెంబరు 08,ప్రభాతవార్త:** నాల్గవ రోజు కొనసాగిన పల్లె పల్లెకు పైలెట్ కార్యక్రమానికి తగ్గిన ప్రజాదరణ.పల్లె పల్లెకు పైలెట్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళన సభకు నాయకులు,ప్రజల నుండి పెద్దగా ప్రజాదరణ లేకపోవడంతో గురువారం నాడు పర్వత్ పల్లిలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళన సభను రద్దు చేసినట్లు విశ్వశనీయ సమాచారం. **పర్వత్ పల్లి:-** పల్లె పల్లెకు పైలెట్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మాట్లాడుతున్న క్రమంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తమ గ్రామంలో అభివృద్ధి ఏం జరిగిందో ముందు చూపి మాట్లాడాలని కోరగా అతడిని పోలీసులు నోరు మూయించారు.ఈ క్రమంలో మరికొంతమంది గ్రామస్తులు ఎమ్మెల్యేపై అసంతృప్తి వ్యక్తం చేశారు.ఇలా నోరు మూయిస్తే తమ గ్రామ సమస్యలు ఎవరితో చేప్పుకొవాలని అన్నారు. **బాబునాయక్ తండా:-** మండల పరిధిలోని బాబునాయక్ తండాలో నిర్వహించిన పల్లె పల్లెకు పైలెట్ కార్యక్రమానికి సైతం గ్రామస్థులు లేక కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి.ఇండ్ల వద్దా,రోడ్లపైన నిలుచున్న మహిళలను పిలిచి మరీ కుర్చీలపై కూర్చోండి అంటూ ఎమ్మెల్యే సైన్యం మహిళలను బతిబాలుకుంది.

# పాదర్శకంగా ఓటర్ల తుది జాబితా రూపొందించాలి

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

జిల్లాలో చేపట్టిన ఓటరు నమోదు,సవరణలు,తొలగింపులు,ఆధార్ అనుసంధానం ప్రక్రియను ఎలక్ట్రోల్ పరిశీలకులు వాణి ప్రసాద్ పరిశీలించారు.గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ నిఖిల,అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ,ఆర్‌డిఓ అశోక్ కుమార్, వికారాబాద్ ఆర్డీవో విజయ కుమారిలతో కలిసి తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలో ప్రత్యేక ఓటరు నమోదులో భాగంగా చేపట్టిన పనుల ప్రగతిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ఓటరు నమోదుకు వచ్చిన కొత్త దరఖాస్తులకు బిఎల్‌ఓల ద్వారా క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆమోదించాలన్నారు. మరణించిన వారి పేర్లను ముందుగా నోటీసు ఇచ్చి డెత్ సర్టిఫికెట్ తీసుకున్న తరువాత తొలగించాలని అన్నారు.అదే విధంగా మైగ్రేటేడ్ ఓటర్లను పరిశీలించాలని,ఒక వ్యక్తికి రెండు ఎపిక్ కార్డులు ఉన్నట్లయితే అట్టి వారిని సంప్రదించి డూప్లికేట్ ఓటును పద్ధతి ప్రకారంగా తొలగించాలని అన్నారు. బియల్‌ఓలు ఇంటింటికి వెళ్లి వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు.బియల్‌ఓలు అవసరమైన రిజిస్టర్ తప్పనిసరిగా నిర్వహించాలని ఈఆర్‌ఓలు రిజిస్టర్లను పరిశీలిస్తూ ఉండాలన్నారు.బియల్‌ఓలు పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో ఈఆర్‌ఓలు ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ పారదర్శకంగా ఓటర్ల తుది జాబితా రూపొందించాలని సూచించారు.జిల్లాలో ఓటర్ కార్డుకు



ఇప్పటి వరకు 60శాతం మాత్రమే ఆధాకర్ కార్డు అనుసంధానం చేయడం జరిగిందని,పొలిటికల్ పార్టీల సహకారంతో వంద శాతం పూర్తి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిఖిల మాట్లాడుతూ... జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలలో 1130 పోలీంగ్ కేంద్రాలు గలవని తెలిపారు.ఇద్దరు ఈఆర్‌ఓలు,22మంది ఏఈఆర్‌ఓలు ఉన్నారని తెలిపారు.జిల్లాలో ఓటర్ నమోదుకు కొత్తగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఎపిక్ ఓటరు కార్డులను సంబంధిత అభ్యర్థులకు అందజేస్తామన్నారు.సవరణ,మార్పులు,చేర్పులు పెళ్లై వెళ్లిపోయిన వారి పేర్లు,డూప్లికేట్ ఓట్ల తొలగింపు నియోజకవర్గం మార్పు,చనిపోయిన వారి పేర్లను తొలగించేందుకు అభ్యంతరాలను పరిశీలించి పారదర్శకంగా ఓటరు జాబితా తయారు చేస్తున్నట్లు తెలియజేశారు.

### పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో సమావేశం

ఎలక్ట్రోల్ పరిశీలకులు వాణి ప్రసాద్ మాట్లాడుతూ...పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో ఎప్పటికప్పుడు సమావేశాలు,నిర్వహిస్తూ ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు ఓటరు లిస్టు అందిస్తూ,పారదర్శకంగా ఓటర్ల తుది జాబితా తయారు చేసేందుకు వీరిని భాగస్వాములు చేయాలన్నారు.పార్టీల వారీగా బూత్ లెవెల్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని అవసరమైన వివరాలు అందిస్తుండాలని కోరారు.ఓటర్ నమోదుకు గురువారం చివరి దినమైన ఆధార్ అనుసంధానానికి సహకారం అందించాలని అన్నారు.ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేసేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.అనంతరం వికారాబాద్ నియోజకవర్గంలోని సంగం లక్ష్మీబాయి పాఠశాలలో మరియు మన్నెగూడలో ఓటర్ నమోదు కేంద్రాలను సందర్శించి బిఎల్‌ఓలు చేపడుతున్న పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు.ఈ సందర్భంగా బిఎల్‌ఓలు నిర్వహిస్తున్న రిజిస్టర్లను,కొత్తగా ఓటరు నమోదు చేసుకున్న దరఖాస్తులను డూప్లికేట్ ఓట్లను,చనిపోయిన వారి తొలగింపు వివరాలను పరిశీలించారు.ఈ సమావేశంలో స్వీప్ మోడల్ ఆఫీసర్ కోటాజీ,తహసీల్దార్లు,వివిధ పార్టీ ప్రతినిధులు,పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రాల్లో సిజేరియన్స్ తగ్గించాలి

**-సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి**

**-ఎఎన్ఎంలకు, ఆశవర్కర్లకు మార్గదర్శకం**

**-మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్**

**-కలెక్టరేట్‌లో జరిగిన ఎఎన్ఎం,ఆశవర్కర్ల సమావేశం**



.మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ఎఎన్ఎం,ఆశవర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, పాల్గొన్న తదితరులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి డిసెంబరు 8, ప్రభాతవార్త**

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో (పిహెచ్‌సి,యుపిహెచ్‌సి) డెలివరీ పాయింట్స్‌లో అవసరమైన ప్రసూతి సేవలను నిర్వహించాలని, సిజేరియన్ రేటును తగ్గించాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని ఎఎన్ఎంలకు, ఆశవర్కర్లకు మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సూచించారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రభుత్వ కార్యదర్శి ఆదేశాల మేరకు ఛీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్, ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ హైదరాబాద్, కమిషనర్ ఆఫ్ హెల్త్ మేనేజింగ్‌డైరక్టర్ (ఎన్‌హెచ్ఎం) ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన ఆరోగ్య యోజన (పిఎం-జెఎవై), ఆరోగ్యశ్రీ పథకం కోసం (ఈ-కెవైసి) జనరేషన్ కార్యకలాపాలను రూపొందించటానికి ఎఎన్ఎంల, ఆశవర్కర్లను నిమగ్నం చేయటానికి, అదే విధంగ తెలంగాణ రాష్ట్రంలో అమలు అవుతున్న ఏకైక కమ్యూనిటీ హెల్త్ ఇన్సురెన్స్ పథకంలపై సమీక్షించి అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. ఈ పథకం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఆసుపత్రిలో చేరటం, శస్త్ర చికిత్స అవసరమయ్యే తీవ్రమైన వ్యాధుల చికిత్స కోసం ఆర్థిక రక్షణను అందిస్తుందన్నారు. గుర్తించబడిన ఆరోగ్య సంరక్షణ ప్రధాతల నెట్ వర్క్ ద్వారా ఆసుపత్రిల్లో చేరటం, శస్త్ర చికిత్సలు, చికిత్సలతో కూడిన గుర్తించబడిన వ్యాధుల చికిత్స కోసం నాణ్యమైన వైద్య సంరక్షణకు బిపిఎల్ కుటుంబాలకు ప్రాధాన్యతను ఇస్తూ మెరుగు పర్చటమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమని ఆయన అన్నారు. ప్రభుత్వ ఆరోగ్యకేంద్రాల్లో సాధారన ప్రసవాలను ప్రోత్సహించాలని, ఈ బాధ్యత ఎఎన్ఎంలు, ఆశవర్కర్లపై ఉందని డాక్టర్ పుట్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ మల్కాజ్‌గిరి డివిజన్ డాక్టర్ ఆనంద్, డిపిఓ (ఎన్‌హెచ్ఎం) ఆరోగ్యశ్రీ శాఖనుంచి సుమన్, ఉపేంద్ర, శిక్షకులు, ఎఎన్ఎంలు,ఆశవర్కర్లు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎఎన్ఎంలు,ఆశవర్కర్ల దృశ్యం

# మున్సిపల్ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత : మంత్రి మల్లారెడ్డి



దమ్మాయిగూడ మున్సిపల్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి,మున్సిపల్ చైర్మన్ ప్రణీత శ్రీకాంత్‌గౌడ్



దమ్మాయిగూడ మున్సిపల్‌లోని వివిధ కాలనీలో పర్యటిస్తున్న మంత్రి మల్లారెడ్డి

**కీసర,డిసెంబరు8,ప్రభాతవార్త:**

మున్సిపల్‌ల అభివృద్ధి సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యతనిస్తూ అనేక నిధులను మంజూరు చేస్తున్నారని రాష్ట్ర కార్మిఖ శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు.గురువారం దమ్మాయిగూడ మున్సిపల్‌లోని వివిద వార్డులలో సుమారు 1 కోటి రూపాయలతో సీసీ రోడ్డు,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు చేశారు.7వ వార్డులోని ప్రగతినగర్ కాలనీలో భూగర్భ మురికి కాలువ నిర్మాణం కోసం 6.7 లక్షలు, ఖుషి గార్డెన్స్‌లో 5 లక్షలతో భూగర్భ మురికి కాలువ నిర్మాణం కోసం, వికాస్‌నగర్ కాలనీలో భూగర్భ మురికి కాలువ నిర్మాణం కోసం 10 లక్షలు, వెంకటేశ్వర నగర్ కాలనీలో మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేయడం జరిగింది.16 వార్డులో శ్రీ రామచంద్ర కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి 14 లక్షలు,17వ వార్డు ఎంఎన్‌ఆర్ కాలనీలో సీసీ రోడ్లకు 6 లక్షలు,బాల్‌రెడ్డినగర్ భూగర్భ మురికి కాలువ నిర్మాణం కోసం 10 లక్షలతో శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్ర దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.మున్సిపల్‌ల సర్వతో ముఖాభివృద్ధికి టీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసి అధిక నిధులు కేటాయిస్తుందని ఆయన చెప్పారు.కాలనీల అభివృద్ధికి ప్రజలంతా భాగస్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్,కమీషనర్ స్వామి,వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి,డిఈ సుమతి,కౌన్సిలర్లు నాగాయపల్లి సుజాత శ్రీనివాస్,మంగళపురి వెంకటేష్,వసుపతి రమేష్‌గౌడ్,సంపన్‌బోలు స్వప్న హరిగౌడ్,మాదిరెడ్డి పావనిరెడ్డి,పాండాల అనురాధ యాదగిరిగౌడ్,మోర మౌనిక నరహరిరెడ్డి, రామారం శ్రీహరిగౌడ్,కో ఆప్షన్ సభ్యులు కందాడి చెన్నారెడ్డి,వహిదా బేగం,కీసరగుట్ట ట్రస్టుబోర్డు సభ్యులు దుర్గం సాయినాథ్‌గౌడ్,పట్టణ అధ్యక్షులు కౌకుట్ల తిరుపతిరెడ్డి,నాయకులు ఖజామియా,నాగాయపల్లి శ్రీనివాస్‌గౌడ్,కొత్త శ్రీనివాస్‌గౌడ్,కొత్త భాస్కర్‌గౌడ్,మోర నరహరిరెడ్డి, కిరణ్‌గుప్తా, సుజాత గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆకర్షితులై టిఆర్ఎస్‌లో చేరికలు

**-ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి**



**యాచారం, డిసెంబర్ 8 ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి కెసిఆర్ అందిస్తున్న సుపరిపాలన, సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై పలు పార్టీల నుండి నాయకులు టిఆర్ఎస్‌లో చేరుతున్నారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మంతన్‌గౌరెల్లి ఉప సర్పంచ్ ఎన్. రమేష్, వార్డు సభ్యులు సునీతా రవీందర్‌లు ముఖ్యమంత్రి కెసిఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో సిపిఎం, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో టిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా కొనసాగిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని, అభివృద్ధిలో దూసుకుపోతున్నందున వివిధ పార్టీల నుండి కార్యకర్తలు పెద్ద ఎత్తున టిఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. సురేష్, బిచ్చ, లల్లు, జంగయ్య, పరమేష్, చందు, లల్లు, కుమార్ తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పాశ్చ భాష, పిఎసిఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కారింగి యాదయ్య, డైరెక్టర్ నరేంద్ర, గ్రామశాఖ అధ్యక్షులు బిక్కునాయక్, ప్రధాన కార్యదర్శి హాజీ నాయక్, వార్డు సభ్యులు యాట శ్రీనివాస్, సీనియర్ నాయకులు రాజు నాయక్, ఓరుగంటి యాదయ్య, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వంటిమామిడికి అదనపు బస్సు సౌకర్యం కల్పించాలి

**-బీసీ విద్యార్థి కేంద్ర కమిటి సంఘం అధ్యక్షుడు అరుణ్ యాదవ్ వినతి**

**మేడ్చల్, డిసెంబర్ 8. ప్రభాతవార్త :** మేడ్చల్ నుండి వంటిమామిడికి అధనంగా బస్సు సర్వీసును పెంచాలని కోరుతూ బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటి అధ్యక్షుడు అరుణ్ యాదవ్ మేడ్చల్ బస్‌డిపో మేనేజర్ సుధాకర్‌కు వినతి పత్రం అందజేశారు. మేడ్చల్ నుండి వంటిమామిడికి వెళ్లే రూట్‌లో బస్సు సర్వీసులు తక్కువగా ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తూ ఉదయం నుండే బస్‌డిపోలో బైటాయించారు. కాగా వారు స్పందించకపోవడంతో గురువారం జరిగిన మేడ్చల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి వెళ్లి అక్కడ కూడ ఎంపిపి, ఎండివోకు సమస్యను విరించాడు. కాగా బస్సులు సమయానికి రాక రాత్రి 7.30 గంటల వరకు విద్యార్థులతు బస్‌డిపోలో ఉండటంతో ఆరుణ్ యాదవ్ ఈ సందర్బంగా మాట్లాడుతూ కొక్కొండ, సింగన్నగూడెం, కొత్తూర్, మైలారం, తునికి బొల్లారం, వంటిమామిడి నుండి సుమారు 300 నుండి 350 మంది విద్యార్థులు మేడ్చల్ వైపు వచ్చి వివిద విద్యాసంస్థల్లో చదువుకుంటున్నారని తెలిపారు. కాగా ఈ రూట్‌లో ఒకే బస్సు నడువడంతో విద్యార్థులకు బస్సు సరిపోవు బస్సు సౌకర్యం లేక చదువు మానివేసి హోటళ్లు, కంపనీల్లో పని చేస్తూ కూలీలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. వెంటనే ఈ రూట్‌లో బస్సు సౌకర్యం పెంచకపోతే ఉద్యమానికి సిద్ధమౌతామని ఆయన హెచ్చరించాడు. కార్యక్రమంలో నాయకుడు నాగేష్, నాగరాజు, అభిషేక్, గీత, శాలిని, కిరణ్, వివేక్, సంధ్య, రమ్య, శ్యాం, కీర్తి తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ బస్‌డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న అరుణ్ యాదవ్

# లింగ వివక్షత లేని సమాజం కోసం కృషి చేయాలి : ఎస్పీ కోటిరెడ్డి

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

లింగ వివక్షత లేని సమాజం కోసం అందరూ కృషి చేయాలని ఎస్పీ కోటిరెడ్డి పేర్కొన్నారు.గురువారం లింగ వివక్షత లేని సమాజం కోసం జాతీయ ఉద్యమం సందర్బంగా వికారాబాద్ జిల్లా పోలీసు తరపు యాటీ హ్యూమన్ ట్రాఫీక్ యూనిట్ ఆధ్వర్యంలో అన్ని శాఖలు కలిసి చేపట్టిన ర్యాలీలో జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమం బిజెఆర్ చౌరస్తాలో ప్రారంభం అయి ఎంఆర్‌పి పెట్రోల్ పంప్ వరకు కొనసాగింది.ఈ సందర్భంగా ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ... కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు,యువతి యువకులు,వివిధ శాఖల అధికారులకు అందరికీ శుభాకాంక్షలు అని సమాజంలో లింగ వివక్షత లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల లింగ వివక్షత చూపరాదని



,మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లల్ని కూడా చదివించి సమాజంలో ఎదగనివ్వాలని,బాల్య వివాహాలు నిర్మూలించి ఆడపిల్లలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని,నవంబర్ 25 నుండి డిసెంబర్ 23 వరకు మహిళాలు, పిల్లల భద్రత విభాగం తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని మహిళలు పిల్లలు తమపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు హెల్ప్ లైన్ నంబర్లు,100,112,1098 నెంబర్లకు ఫోన్ చేసి తెలపాలని,హెల్ప్‌లైన్ నెంబర్‌లపై విద్యార్థినిలు గ్రామాల్లో ఉన్న మహిళలకు అవగాహన కల్పించాలని,తమపై ఏమైనా లైంగిక దాడులు జరిగిన,ఆడపిల్లలు అని వివక్ష చూపిన వెంటనే తమ తల్లిదండ్రులకు గాని తమ టీచర్లకు గాని పోలీసు అధికారులకు సమాచారం అందించాలని ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎంఎ రశీద్,డిఎస్పీ సత్యనారాయణ,విమెన్ పిఎస్ ఇన్స్‌పెక్టర్ ప్రమీల,వికారాబాద్ టౌన్ టి.శ్రీనివాస్, ఏహెచ్‌టియూ టీమ్ ఇన్స్‌పెక్టర్ వి.దాసు,వికారాబాద్ మున్సిపల్ చైర్మన్ మంజుల రమేష్,పోలీసు సిబ్బంది,వివిధ శాఖల అధికారులు వివిధ కళాశాలకు చెందిన విద్యార్థులు,పాల్గొన్నారు.

# కేశంపేట ఏఎన్ఎం పై కత్తితో దాడి

**- పెళ్లి చేసుకోవాలంటూ సొంత మరదలిపై అఘాయిత్యం**

**- పోలీసుల అదుపులో నిందితుడు కిషన్‌నాయక్**

**- పెళ్లి చేసుకోవడం లేదని అక్క భర్త ఘాతుకం : ఎస్సై ధనుంజయ వెల్లడి**

**షాద్‌నగర్, డిసెంబర్ 8, (ప్రభాతవార్త) :**

సొంత మరదలు, కట్టుకున్న భార్య తొబుట్టువైన చెల్లెలిపై ఆమె బావ తనను పెళ్లి చేసుకోవాలంటూ కొంతకాలంగా వేదిస్తూ మరదలుపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చాడు. మరదలు పెళ్లికి ససేమీరా అనడంతో కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న మరదలుపై కూరగాయలు కోసే కత్తితో దాడికి పాల్పడ్డాడు. షాద్‌నగర్ నియోజకవర్గం కేశంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. మంచాల మండలం ఎల్లమ్మ తాండకు చెందిన అనిత అవుట్ సోర్స్ ఉద్యోగినిగా ఆసుపత్రిలో పనిచేస్తుంది. ఎప్పటిలాగే విధులు నిర్వహిస్తున్నా ఏఎన్ఎం అనితను బావ కిషన్ నాయక్ గురువారం తెల్లవారజామున 3.30 గంటలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకొని ఆమె పై దాడికి పాల్పడ్డాడు. కత్తితో దాడి చేస్తుండటంతో విడిపించుకునే క్రమంలో ఆమె చేతివేళ్లకు, మెడ భాగంలో తీవ్ర గాయాలు అయ్యాయి. ఆసుపత్రిలో కిషన్ నాయక్ అనితపై దాడిచేస్తున్న సంఘటన మొత్తం అక్కడ ఉన్న సీసీ టీవీ ఫుటేజీలో రికార్డు అయ్యాయి. ఈ సంఘటన చూసిన కాంటిజన్స్ వర్కర్లు, నైట్ వాచ్‌మెన్‌లు, మరికొందరు కలిసి అతనిని పట్టుకొని రూంలో బందించగా అతను వెంటిలెటర్ ద్వార తప్పించుకొని పారిపోయాడని అక్కడి సిబ్బంది తెలిపారు.

### పెళ్లి చేసుకోవడం లేదని దాడికి పాల్పడ్డాడు : ఎస్సై ధనుంజయ

ప్రాథమిక కేంద్రంలో ఏఎన్ఎం గా విధులు నిర్వర్తిస్తున్న అనితపై ఆమె కిషన్ నాయక్ తనను పెళ్లి చేసుకోవడం లేదనే ఈ దాడికి పాల్పడ్డాడు. స్వయనా అక్క భర్త అయిన కిషన్ నాయక్ గత కొంత కాలంగా అనితను పెళ్లి చేసుకోవాలని వెంట పడుతూ వేధిస్తున్నాడని, ఈ క్రమంలోనే గురువారం తెల్లవారుజామున అదును చూసుకొని దాడికి



గాయపడిన ఏఎన్ఎం అనిత.

పాల్పడి ఆమెను గాయపరిచాడు. ప్రస్తుతం కిషన్ నాయక్ పోలీసుల అదుపులోనే ఉన్నాడని ఎస్సై ధనుంజయ మీడియాకు తెలిపారు. ఈ సంఘటనపై పూర్తి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై ధనుంజయ తెలిపారు.

### గాయపడిన ఏఎన్ఎంను షాద్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలింపు...

దాడిలో గాయపడిన ఏఎన్ఎం అనితను 108 అంబులెన్స్ వాహనంలో మెరుగైన వైద్యం కోసం షాద్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అనితకు గొంతు భాగంలో నాలుగు కుట్లు, చేతిపైన 8 కుట్లు వేయడం జరిగిందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగానే ఉందని, మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు వైద్యులు పేర్కొన్నారు.

# సంక్షేమ బాటలో సిఎం కెసిఆర్ ప్రభుత్వం

**-డబుల్ బెడ్‌రూం ఇళ్లలో అందరికి సమన్యాయం**

**-నందిగామ గ్రామ సభలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**



నందిగామ గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

**నందిగామ డిసెంబర్8,ప్రభాతవార్త :**

ముఖ్యమంత్రి కెసిఆర్ ఎనిమిదేళ్ల పాలన సువర్ణ అధ్యాయమని,అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సుపరిపాలన అందిస్తున్నారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ అన్నారు.గురువారం నందిగామ మండల కేంద్రంలో జరిగిన డబుల్ బెడ్ రూం ఇళ్ల ఎంపిక కోసం సర్పంచ్ జిల్లెల వెంకట్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు...ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనల ప్రకారం అర్హతలున్న నిరుపేదలను గుర్తించి డబుల్ బెడ్ రూం ఇల్లు కేటాయిస్తారని స్పష్టం చేశారు.ఇండ్లు కూలి,ఇల్లు లేని వారు శుక్రవారం వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.దేశానికి ఆదర్శంగా తెలంగాణ అడుగులు వేస్తుందన్నారు.సర్పంచ్ జిల్లెల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ...ఎమ్మెల్యే కృషి ,ప్రజల భాగస్వామ్యంతో నందిగామ గ్రామాన్ని పట్టణానికి తీసిపోని రీతిలో అభివృద్ధి చేస్తూన్నామన్నారు.బైపాస్ నుండి మహాత్మాగాంధీ చౌక్ వరకు రహదారి నిర్మాణానికి రూ.60లక్షలు మంజురైయ్యాయని అన్నారు.రోడ్లు,అండర్ డ్రైనేజీలు, జీఎంఆర్ సహకారంతో నందిగామ,పిట్టెలగూడ,తండాలకు రోడ్లకు ఇరువైపులా సోలార్ లైట్లు ఏర్పాటు చేశామన్నారు.అన్ని అర్హతలున్న నిరుపేదలకు ఇళ్లు కేటాయిస్తారని,రాని వారు బెదాభిప్రాయాలు పెట్టుకోవద్దని హితువు పలికారు.జడ్పివైస్ చైర్మన్ ఈట గణేష్ మాట్లాడుతూ...నియోజకవర్గం అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యేకు ఎమిచ్చిన రుణం తీసుకోలేమని ,ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రాజేశ్వరి,తహసీల్దారు ఎండి రహమాన్,ఎంపిడిఓ బాల్ రెడ్డి,ఎఎంసి మాజీ చైర్మన్ నారాయణ రెడ్డి,ఆర్ఐ రోజ,సిఐ రామయ్య, ఎంపిటిసిలు,కొమ్ము కృష్ణ,చంద్రాపాల్ రెడ్డి,వార్డు సభ్యులు,గ్రామస్థులు పాల్గొన్నారు.



చిన్నారులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు,నాయకులు

## చిన్నారులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

**న్యాల్‌కల్, డిసెంబరు 8, ప్రభాతవార్త:** నూతన వస్త్రాలంకరణ కార్యక్రమాన్ని పురస్కరిం చుకుని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే మహ్మద్ ఫరీదుద్దీన్ తనయుడు మహ్మద్ తన్వీర్, టిఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులుర ప్రజాప్రతినిధులు చిన్నారులను ఆశీర్వదించారు. మండలంలోని హద్నూర్ గ్రామానికి చెందిన మాజీ సొసైటీ చైర్మన్ యంఆర్ బస్వరాజ్ తనయుడు హద్నూర్ సొసైటీ డైరెక్టర్ యంఆర్ ప్రవీణ్‌కుమార్, శ్వేతల పుత్రికలు యంఆర్ హర్షిత, యంఆర్ శ్రావణిలకు గురువారం జహీరాబాద్ పట్టణంలోని పివిఆర్ గార్డెన్‌లో మధ్యాహ్నం నూతన వస్త్రాలంకరణ శుభకార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మా ణిక్‌రావు, మాజీ జడ్పీటిసి సభ్యులు బ్యాత చంద్రప్ప, హద్నూర్ సొసైటీ చైర్మన్ ఎక్కల్లి జగన్నాథ్‌రెడ్డి, రాష్ట్రీయ బసవధళ్ రాష్ట్ర అధ్యక్షులు కుసున్నూర్ శివకుమార్, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మున్నూర్ రవీందర్, మాజీ అధ్యక్షులు ఎల్‌చెల్ నరసింహారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు మాతంశెట్టి రాజ్‌కుమార్, బోద భాస్కర్, మాతంశెట్టి వీరమణి, షబ్బీర్‌ఖాన్, గౌసోద్దీన్, తిరుమల బక్కారెడ్డి, మంగలి మహేష్, రవికుమార్, వైజనాథ్, ఇజ్రాయిల్ బాబి, నిరంజన్‌రెడ్డి, మహిపాల్, డప్పూర్ మాణి క్‌రెడ్డి, బస్వరాజ్‌పాటిల్, పాండురంగారావు పాటిల్ తదితరులు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించ ఇంటిపెద్దలకు శుభాకాంక్షలు తెలిపారు.

## భూ సమస్యలకు ధరణితో శాశ్వత పరిష్కారం

**-ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**



రెవిన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**జిన్నారం, డిసెంబరు 8, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన ధరణి పోర్టల్‌తో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరికిందని, మిగిలిపోయిన భూ సమస్యలకు రెవిన్యూ సదస్సు లతో పూర్తి స్థాయిలో పరిష్కారం అవుతున్నాయని పటాన్‌చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. భూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చేందుకే రెవిన్యూ సదస్సు లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమస్యలను అక్కడికి అక్కడే పరిష్కరిస్తూ రైతులకు ప్రభుత్వం వెన్నంటి ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్ సరిత సురేందర్ గౌడ్, తహసీల్దార్ దశరథ్ సింగ్, ప్రజాప్రతినిధులు, నాయకులు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## మెరుగైన జీవనం కోసం వలసలు

**- అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉదయ్ చంద్ర**

**పటాన్‌చెరువు, డిసెంబరు 8, ప్రభాతవార్త:** మెరుగైన జీవనం కోసం ప్రజలు వలస వెళుతుంటారని, దాదాపు 4.5కోట్ల మంది భారత దేశంలో సంచార జీవనం గడుపుతు న్నారని ఖతార్ జార్జ్‌టౌన్ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉదయ్ చంద్ర అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీసన అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో విదేశీయులు, సంచార వలస దారులు, భారత దేశంలో మానవ చలన శీలత యొక్క సామాజిక శాస్త్రం అనే అంశంపై గురువారం అతిథ్య ఉపన్యాసం చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఇతర గ్రామాలకు, గ్రామాల నుంచి పట్టణాలకు, పట్టణాల నుంచి మరో పట్టణానికి లాంటి మూడ రకాల మానవ చలనశీలతలు ఉన్నట్లు వివరించారు. వలస వెళ్లిన వారు అనధికారిక ఆర్థిక వ్యవస్థల, అనిశ్చిత పరిస్థితులలో, తక్కువ ఉద్యోగ భద్రతతో పని చేస్తున్నట్లు వివరించారు. వలసల ఆర్థిక సిద్ధాంతాలుమానవ చలనశీలత యొక్క సామాజిక-సాంస్కృతి తర్కాన్ని పట్టుకోలేవని ఆయన స్పష్టీకరించారు. విద్యార్థులు లేవనెత్తిన పలు ప్రశ్నలకు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉదయ్ చంద్ర నివృతి పర్చారు.

## గడిపెద్దపూర్‌లో ఏడు ఇండ్లల్లో చోరీ



బీరువాను ధ్వసం చేసి దుస్తులను
చిందవందరగా పడవేసిన దొంగలు

**అల్లాదుర్గం, డిసెంబర్ 8, ప్రభాతవార్త:** మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం గడిపెద్దపూర్‌లో గ్రామంలో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు 7 ఇండ్లల్లో వరుస దొంగతనాలు చేసిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే గడిపెద్దపూర్ గ్రామానికి చెందిన మల్కగోరి యాదయ్య, కొడూరి విఠల్ కుటుంబ సభ్యులతో కలిసి తమ ఇండ్లకు తాళలు వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. పక్కింటివాళ్లు మీ ఇండ్ల తాళలు పగలగొట్టి ఉన్నాయని ఫోన్ ద్వారా సమాచారం తెలిపారు. వరుసగా గుర్తుతెలియని దుండగులు 7 గురి ఇంటి తాళలు పగలకొట్టారు. కాగా మల్కగోరి యాదయ్య ఇంటి తాళలు పగలగొట్టి దొంగలు ఇంట్లోకి చొరబడి దొంగతనాలు చేశారు. యాదయ్య ఇంట్లో 3 తులల బంగారు నాను, 30 తులాల వెండి కడియాలు, 90 వేల రూపాయల నగదు, 3 తూలల వెండి చెక్కుడుగుత్తిని దోచుకెళ్లారు. అదే విధంగా మరొక ఇంట్లో కొడూరి విఠల్ ఇంట్లో ఇంటితాళలు పగలగొట్టి ఇంట్లోని బీరువాను ధ్వసం చేసి 70 వేల నగదు, 9 తూలల వెండి, 1 తులం బంగారు. వీలువైన పట్టుచీరను కూడా దొంగిలించారని బాధితుడు విఠల్ తెలిపారు. విఠల్, గొల్ల సత్యనారాయణ, గొల్ల భాగమ్మ, మరో 2 ఇండ్లల్లో కూడా దొంగలు ఇంటి తాళలు పగలగొట్టి దొంగతనానికి యత్నించినట్లు గ్రామస్థులు తెలిపారు. కాగా ఐదు ఇండ్లలో తాళలు పగలగొట్టడంతో చుట్టుప్రక్కల వారు లేచి చప్పుడు చేయడంతో దొంగలు పారిపోయినట్లు ఈ ఇండ్లల్లో ఏలాంటి వస్తువులు దొంగిలించబడలేవని ఆయా కుటుంబీకులు తెలిపారు. మల్కగోరి యాదయ్య, కొడూరి విఠల్ ఇండ్లల్లోనే దొంగతనలు జరిగాయని ఆ కుటుంబీకులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న అల్లాదుర్గం ఏఎస్ఐ పెంటయ్య ఘటన స్థలానికి చేరుకొని దొంగతనాలుజరిగిన ఇండ్లవద్దకు వెళ్ళి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మల్కగోరి యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపు తున్నట్లు ఏఎస్ఐ పెంటయ్య తెలిపారు.

## హత్నూర బిజెపి పార్టీ దళిత మోర్చా అధ్యక్షులుగా మల్లేష్

**హత్నూర, డిసెంబర్ 8, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ హత్నూర మండల దళిత మోర్చా అధ్యక్షులుగా నస్తిపూర్ గ్రామానికి చెందిన గోవు మల్లేష్ ను హత్నూర మండల బిజెపి అధ్యక్షులు నాగప్రభు గౌడ్ నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి దళితమోర్చా జిల్లా కార్యదర్శులు వరిగుంతమ్ శంకర్, కమలాకర్, బిజెపి మండల కార్యదర్శి కొలని రవి, మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడు చంద్ర గౌడ్, జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు పాలంచ ప్రసాద్, మురళి కృష్ణ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి

## 13న లక్ష్మారెడ్డి మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్

**రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి**

**నర్సాపూర్,డిసెంబర్ 8, ప్రభాతవార్త**

ఈ నెల 13 న వాకిటి లక్ష్మారెడ్డి మెమోరియల్ పేరిట నియోజకవర్గ స్థాయి వాలీ బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి తెలిపారు. గురువారం ఆమె నర్సాపూర్‌లోని ఆమె స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూనియోజక వర్గస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.వాలీబాల్ టోర్నమెంట్ లో పాల్గొన దలిచిన క్రీడాకారులు ఎలాంటి ఎంట్రీ పీజు చెల్లించవల్సిన అవసరం లేదన్నారు ఈనెల 11 తేదీ వరకు తమ పేర్లను క్రీడాకారులు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.ఈ నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలు శివ్వంపేట మండలంలోని గోమారంలో నిర్వహిస్తుండగా శివ్వంపేట, వెల్దుర్తి, మాసాయిపేట మండలాల గ్రామల క్రీడాకారులు ఇక్కడ పాల్గొంటారని, అదేవిదంగా నర్సాపూర్‌లోని బివిఆర్ఐటి కళాశాలలో నిర్వహించే వాలీబాల్ టోర్నమెంట్‌లో నర్సాపూర్, కౌడిపలి, హత్నూర,చిలిపిచెడ్ కొల్చారం మండలాలకు చెందిన గ్రామాల క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఈవాలీబాల్ టోర్నమెంట్ ఈనెల 13 న ప్రారంభమై 23 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఇందులో ప్రథమ బహుమతికి 50 వేలు, ద్వితీయ బహుమతికి 35 వేలు, తృతీయ బహుమతికి 15 వేలు, నాలుగవ బహుమతికి 5 వేల రూపాయిల నగదు బహుమతులను అందజేస్తామని ఆమె తెలిపారు.ఈ మేరకు ఈ వాలీబాల్ టోర్నమెంట్ లో పాల్గొనదలిచిన క్రీడాకారులు ఫోన్ నెంబర్లకు 9912509900 మరియు7386561178 లకు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈమేరకు గ్రామీణ క్రీడాకారులు అధిక సంఖ్యలో హాజరై ఈ వాలీబాల్ టోర్నమెంట్ ను విజయవంతం చేయాలని రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి కోరారు. ఈకార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, పంబళ్ళ బిక్షపతి, తొంట వెంకటేష్, నాగేశ్, సూరారం నర్సింలు, మూసాపేట రవి. సర్పంచ్‌లు జితేందర్‌రెడ్డి, సేనాధిపతి,నాయకులు కాగజ్‌మద్దూర్ అశోక్‌గౌడ్, మంతూర్ వెంకన్న, హుస్సెన్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

## హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ విజయం



సంబరాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**దుబ్బాక (అక్బర్‌పేట భూంపల్లి), డిసెంబర్ 8, ప్రభాత వార్త:** హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించగా అక్బర్‌పేటభూంపల్లి మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ నాయకులు టపాకాయలు కాల్చి, ఇక్కరి ఒక్కరు మిఠాయి తినిపించుకుంటూ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పాతూరి వెంకటస్వామి గౌడ్ మాట్లాడుతూ హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన ఓటర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గుజరత్ మినహ దేశంలో ముందుముందు ఎక్కడ కూడా బిజెపి పార్టీ తన ఉనికిని చూపబోదన్నారు. ఈ దెబ్బంతో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్త చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పూజారి నారాయణ, సాజీత్, అబిద్, ఆశోక్, షేర్‌పల్లి స్వామి, నాగరాజు, యాదగిరి, స్వామి, సాయాగౌడ్, నర్సింలు, దుబ్బారాజం, బాల్‌రాజ్, అంజాగౌడ్, శ్రీనివాస్ గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నాయకుల సంబరాలు



మిఠాయిలు తినిపించుకుంటున్న బిజెపి నాయకులు

**దుబ్బాక, డిసెంబర్ 8, ప్రభాత వార్త:** గుజరాత్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి వరుసగా ఏడవ సారి విజయం సాధించి చరిత్ర సృష్టించిందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్ అన్నారు. గుజరాత్‌లో బిజెపి విజయం సాధించడం పట్ల దుబ్బాక బస్టాండ్ వద్ద గురువారం బాణాసంచాలు కాల్చి మిఠాయి పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకుండా ప్రజారంజక పాలన అందిస్తున్న బిజెపికి గుజరాత్ ప్రజలు వరుసగా ఏరుసార్లు గెలిపించడం చారిత్రాత్మ నిర్ణయమన్నారు. కాంగ్రెస్, ఆప్ లాంటి పార్టీలు ఎన్ని ఉచిత హామీలు ఇచ్చిన ప్రజలు నమ్మలేదన్నారు. ప్రధానమంత్రి నరేందర్ మోడి పాలనపై దేశప్రజలకు పూర్తి విశ్వాసం నమ్మకం ఉందన్నారు. దేశంలో రానున్న ఎన్నికల్లో బిజెపి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లా రెడ్డి, నాయకులు మచ్చ శ్రీనివాస్, మంద అనిల్ రెడ్డి, గాజుల భాస్కర్, సుంకోజి ప్రవీణ్ కుమార్, సప్తగిరి, రమేష్, రమణారెడ్డి, నేహల్ గౌడ్, మోతుకుపల్లి బద్రి, బాచి, సంజీవ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

**రామచంద్రాపురం, డిసెంబర్ 8, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాలనీల అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. రామచంద్రాపుర డివిజన్ పరిధిలోని ఇసుక భావి బస్ డిపో రోడ్డులో 25 లక్షల రూపాయల అంచనాలతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు గురువారం నాడు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో సిసి రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పోరేటర్ పుష్పనగేష్ యాదవ్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న గూడెం మహిపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనితశ్రీనివాస్

## రసా బాసగా మండల సర్వసభ్య సమావేశం

**రాయపోల్, డిసెంబర్ 8, ప్రభాతవార్త :** మండల సర్వసభ్య సమావేశం రసాబాసగా సాగింది. గురువారం రాయపోల్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కల్లూరి అనితశ్రీనివాస్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి సగం మంది సర్పంచ్‌లు దుమ్మ కొట్టారు. మొదట ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ముంగాజిపల్లి గ్రామ సర్పంచ్ రామొల్ల స్వామి మాట్లాడుతూ.. మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలకు సమానంగా నిధులు కేటాయించి చిన్న గ్రామ పంచాయతీలను ఆదుకోవాలని వేడుకున్నారు. అనంతరం రాయపోల్ గ్రామ సర్పంచ్ మూనికరాజిరెడ్డి మాట్లాడుతూ.. సర్వసభ్య సమావేశంలో మహిళలకు సరైన గౌరవం ఇవ్వడం లేదని, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇప్ప లక్ష్మికి ప్రొటోకాల్ పాటించకుండా లాస్ట్ కుర్చీలో కూర్చోబెట్టడం ఏంటని అధికారులను ప్రశ్నించారు. ఎంపీడీవో మునయ్య మాట్లాడుతూ.. మళ్లీ జరిగే సర్వసభ్య సమావేశంలో ఇలాంటి ఘటన జరగకుండా చూస్తానన్నారు. జడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి మాట్లాడుతూ.. గ్రామాలలో రేషన్ కార్డులు ఉన్నప్పటికీ రేషన్ షాపుల్లో కొందరికి వేలు ముద్రలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తహసీల్దార్ సహదేవ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఎంపిపి కల్లూరి అనిత శ్రీనివాస్ మాట్లాడుతూ..గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే మండలం అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశంలో జడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇప్ప లక్ష్మి, వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు పర్వేజ్ హైమాద్, తహసీల్దార్ సహదేవ్,ఎంపీడీవో మునయ్య, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన మండల తహశీల్దార్ వీరేష్‌కు సన్మానం



తహశీల్దార్‌ని సన్మానిస్తున్న రేషన్ డీలర్ సంఘం

**దుబ్బాక (అక్బర్‌పేట భూంపల్లి), డిసెంబర్ 8, ప్రభాత వార్త:** అక్బర్‌పేట భూంపల్లి నూతన మండల రేషన్ డీలర్ల అధ్యక్షుడు ఆరుట్ల నారాయణారెడ్డి ఆధ్వర్యంలో నూతన మండల తహశీల్దార్ వీరేశ్‌ని గురువారం మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సన్మానించి, మిఠాయి తినిపించారు. మండల కార్యాలయానికి వచ్చే ప్రజలు కుర్చోవడానికి కుర్చీలు లేకపోవడంతో కార్యాలయానికి రేషన్ డీలర్ల కార్యవర్గం తరుపున స్వచ్ఛందంగా 10 కుర్చీలను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షుడు జూలూరి నాగభూషణం, ప్రధాన కార్యదర్శి పప్పుల నరేందర్ రెడ్డి, కోశాధికారి ముక్క శ్రీనివాస్ గుప్త, కార్యదర్శి బోర్మిండ్ల మల్లేషం, సలహాదారులు ఏ.రాజయ్య, ఆర్. రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి మహాపడి పూజ



అయ్యప్ప మహాపడిపూజ,మెట్ల పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి
దంపతుల, సునీతాలక్ష్మారెడ్డి, అశోక్‌గౌడ్ గురుస్వామి తదితరులు

**నర్సాపూర్,డిసెంబర్ 8 .ప్రభాతవార్త.**

శబరిమల అయ్యప్ప సేవాసమాజం అధ్వర్యంలో హరివరాసనం శత జయంతి ఉత్సవాల్లో బాగంగా నర్సాపూర్ హైద్రాబాద్ ప్రధాన రోడ్డులోని అటవీ ప్రాంతంలోపందివాగు వద్ద నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో గురువారం అయ్యప్ప సేవాసమితీ అధ్యక్షులు అశోక్‌గౌడ్ గురుస్వామి అధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడిపూజ, మెట్ల పూజలను ఘనంగా నిర్వహించారు. ఈపూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి దంపతులు, రాష్ట్ర మహిళా కమీసన్ చైర్ పర్సన్ సునీతాలక్షారెడ్డి లు పాల్గొన్నారు.అంతకుముందు ఉదయం నర్సాపూర్ శివాలయంలో ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అయ్యప్ప స్వాముల పాదయాత్రను మరియు అయ్యప్ప పల్లకి సేవా ఊరేగింపును ఎమ్మెల్యే మదన్‌రెడ్డి దంపతులు ప్రారంబించారు.ఈ సందర్భంగా అయ్యప్ప స్వాముల పాదయాత్ర అయ్యప్ప పల్లకిసేవా నర్సాపూర్ ప్రదాన వీధులగుండా సాగి చౌరస్తా మీదుగా సాగి అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణం వరకు చేరుకుంది.ఈ పాదయాత్రలో అయ్యప్పస్వామి శరణుఘోషతో నర్సాపూర్ పట్టణంమరియు అయ్యప్ప దేవాలయ ప్రాంగణం మొత్తం మారుమ్రోగింది.ఈ సందన్బంగా అశోక్‌గౌడ్‌గురు స్వామి అధ్వర్యంలో అయ్యప్ప మహాపడిపూజ, మెట్ల పూజలు నిర్వహించగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి దంపతులు, రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి లు పాల్గొన్నారు.

ఈసందర్బంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా శబరిమలై అయ్యప్ప స్వామి దేవాలయం మాదిరిగా నర్సాపూర్‌లో నిర్మించడం అభినందనీయమని అన్నారు. కాగా ఈ మహాపడిపూజ లో పాల్గొనడం తమ అదృష్టంగా బావిస్తున్నానని ఆయన అన్నారు.ఈ దేవాలయ నిర్మాణంలో తన వంతు సహకారం అందిస్తానని పేర్కొంటు తాము కూడ అయ్యప్పస్వామి దేవాలయ నిర్మాణంలో బాగస్వాములవుతుండటం ఆనందంగా ఉందన్నారు. మంచి చక్కటి వాతావరణంలో ఈ అయ్యప్ప ఆలయాన్ని నిర్మించడం గొప్పవిసయమని ఆయన తెలిపారు.అనంతరం రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూఈ అయ్యప్పస్వామి ఆలయం నిర్మాణంతో నర్సాపూర్‌లోఒక దివ్య క్షేత్రంగా తయారువుతుందని అన్నారు.ఆలయ నిర్మాణంలో తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. అందరి అయ్యప్ప స్వాములు ఒక కమిటీ ఏర్పాటు చేసి ఇంతటి పుణ్య క్షేత్రాన్ని నిర్మించడం గొప్ప విశైషమన్నారు.ఈ ఆలయం నిర్మాణ అడవి ప్రాంతంలో చెట్ల మద్యన పక్కన నార్సపూర్ రాయరావు చెరువు ఉండటం ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మించడం అబినందనీయమని తెలిపారు.ఈ మేరకు నర్సాపూర్‌లో బారీ ఎత్తున అయ్యప్ప మహాపడిపూజా, మెట్ల పూజా కార్యక్రమాలను నర్సాపూర్ అయ్యప్ప స్వాముల అధ్వర్యంలో ఎంతో భక్తి శ్రద్ధలతో, నియమనిష్టలతో ఘనంగా జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో నర్సాపూర్ శివాలయం పూజారి గురవులు వీరప్పగురుజీ, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జిల్లా కోఆప్షన్ సభ్యులు మన్సూర్, నర్సాపూర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అనసూయ అశోక్‌గౌడ్, నర్సాపూర్ మున్సిఫల్ చైర్మన్ మురళీయాదవ్, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీదర్‌గుప్త, పిఏ సిఎస్ చైర్మన్ రాజుయాదవ్, శివ్వంపేట ఎంపిపి హరికృష్ణ, జడ్పిటీసి పబ్బ మహేశ్‌గుప్త, పిఏసిఎస్ శివ్వంపేట చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు బోగ చంద్రశేఖర్, శివ్వంపేట అధ్యక్షులు రమణగౌడ్, నాయకులు పాల్గొనగా అయ్యప్ప స్వాములు అశోక్‌గౌడ్ గురుస్వామి, కరుణాకర్‌రురు స్వామి,వేదాగౌడ్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిలర్ నశ్రీన్ నసీర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## వార్డు కౌన్సిలర్ నశ్రీన్ నసీర్‌కు సన్మానం

**సదాశివపేట, డిసెంబర్ 8, ప్రభాతవార్త:** పట్టణంలోని 4వ వార్డులో జనరల్ ఫండ్‌లో భాగంగా హనుమాన్ మందిరం ముందు సిసిరోడ్డును వార్డు కౌన్సిలర్ నశ్రీన్ నసీర్ వేయించినందుకు హనుమాన్ మందిర్ కమిటి సభ్యులు గురువారం నసీర్‌ను శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హనుమాన్ మందిర్ కమిటి సభ్యులు మాట్లాడుతూ ఎన్నో రోజుల నుండి హనుమాన్ మందిరం ముందు రోడ్డు చేడిపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులకు గురైయ్యామన్నారు. హనుమాన్ మందిరం ముందు రోడ్డు వేయించినందుకు వార్డు కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమార్ మందిరం కమిటి అధ్యక్షులు విశ్వనాథం, చంద్రసేనుడు, గౌర్‌రెడ్డి, శ్రీకాంత్, హితేందర్, ప్రవీన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన శ్రీదత్త హోమాలు



దత్తగిరి ఆశ్రమంలో కొనసాగుతున్న దత్తజయంతి ఉత్సవాల దృశ్యం

**ఝరాసంగం, డిసెంబరు 8, ప్రభాతవార్త:** మండలంలోని బర్దీపూర్ గ్రామంలోని శ్రీ దత్తగిరి ఆశ్రమంలో శ్రీ దత్త జయంతి ఉత్సవాలు భక్తి శ్రద్దలతో ఘనంగా కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి మేలుకొలుపు, స్వామి వారికి సుప్రభాత సేవ, గణపతి పూజా, పుణ్యావాచనము, స్వస్తి వాచనము,రుత్విక్ వరణము, గణపతి హవనములు, మధ్యాహ్నం రుద్ర సహిత ధత్త యజ్ఞం, పూర్ణాహుతి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకోవడంతో ఆశ్రమం భక్తులతో కోలాహలంగా మారింది. మాతృశ్రీ అనసూయమాత ఆధ్వర్యంలో శ్రీ దత్తాత్రేయ స్వామివారికి డోలారోహణ కార్యక్రమం కనుల పంగుడువగా కొనసాగింది. కార్యక్రమానికి ఆయా ప్రాంతాల ఆశ్రమాల పీఠాధిపతులుశ్రీశ్రీశ్రీ వైరాగ్య శిఖామణి అవదూతగిరి మహారాజ్, నారాయణఖేడ్ కొండాపూర్ పీఠాధిపతి సంగ్రామ్ మహారాజ్, ధనశ్రీ ఆశ్రమ పీఠాధిపతి శివాచార్య మహారాజ్, సిద్దేశ్వర ఆనంద్‌గిరి మహారాజ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల భక్తులు పాల్గొని తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు.

## జాతర ఉత్సవాల్లో ఎమ్మెల్యే మాణిక్‌రావు



మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**న్యాల్‌కల్, డిసెంబరు 8, ప్రభాతవార్త:** మండలంలోని మల్గి గ్రామంలో కొనసాగుతున్న శ్రీశ్రీశ్రీ మల్గి మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాల్లో గురువారం స్థానిక శాసన సభ్యులు కొనింటి మాణిక్‌రావు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జాతర ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామస్థులు తమ తమ ఇండ్ల నుంచి తలపై బోనాలను ఎత్తుకుని ఆలయం వరకు భజనలు చేస్తూ చేరుకుని స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జాతర ఉత్సవాల్లో మండల సర్పంచులు ఫోరం అధ్యక్షులు రవీందర్, ఉపాధ్యక్షులు మరుతి యాదవ్, ఎంపిటిసి సభ్యులు శ్రీపతి, నాయకులు, ఆయా ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలపై నిరంతర పోరాటం

**రాష్ట్ర ప్రెస్ అకాడమి చైర్మన్ అల్లం నారాయణ**



సమావేశంలో మాట్లాడుతున్న అల్లం నారాయణ

**నారాయణఖేడ్, డిసెంబర్ 8 ప్రభాతవార్త:** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరంగా తమ వంతు కృషి చేస్తామని రాష్ట్ర తెలంగాణ అకాడమి చైర్మన్ అల్లాం నారాయణ అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలంలోని జగన్నాథ్‌పూర్ ఫాంహౌస్‌లో నూతన కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రేస్ ఆకాడమి చైర్మన్ ఆల్లం నారాయణ మాట్లాడుతూ నారాయణఖేడ్ నియోజకవర్గం కర్ణాటక, మహారాష్ట్ర బార్డల్లో ఉన్నపటికీ వార్తల సేకరణలో ఇక్కడున్న జర్నలిస్టులు ముందున్నారన్నారు. ప్రేస్ ఆకాడామికి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.100 కోట్లు మం జూరు చేశారన్నారు. కరోన సమయంలో కూడ జర్నలిస్టులకు సీఎంఆ రఎఫ్ పథకం కింద రూ.6 కోట్లు జర్నలిస్టులకు అందించడం జరిగింద'న్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్య చరణ రూపొందించి ఆయా ప్రాంతాల ప్రజా ప్రతినిధులను కలిసి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలను డబుల్ బేడ్‌రూంల ఇళ్లను మంజూరు చేయించేందుకు ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డితో మాట్లాడి ఇళ్లు ఇప్పించేలా కృషి చేస్తామన్నారు. జర్నలిస్టులకు సంబంధించిన ఎటువంటి సమస్యలు వచ్చిన వాటిని పరిష్కరించేందుకు టీయుడబ్ల్యుజే హెచ్ 143 యూని యన్ ముందుండి పరిష్కరిస్తుందన్నారు.హెల్ కార్డుల కోసం మన ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.25 కోట్ల నిధులు విడుదల చేశారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారని రాష్ట్రాన్ని సాధించడంతో పాటు జర్నలిస్టుల సమస్యలను ఒక్కొక్కటి పరిష్కరించుకుంటున్నామన్నారు.కాగా నారాయణఖేడ్ మంగల్‌పేట్‌లోని భవాని మందిర్ నుంచి అంబేద్కర్ చౌరస్త వరకు ర్యాలీ నిర్వహించి టపకాయలు పేల్చి బాబాసాహేబ్ అంబేద్కర్ విగ్రహా నికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఇస్మా యిల్, ప్రధాన కార్యదర్శి మారుతిసాగర్, ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షు లు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాదగిరిగౌడ్, శరణమయ్య ప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీధర్‌గౌడ్, దారాసింగ్, యోగానందరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు శ్రీకాంత్ కులకర్ణి, అధ్యక్షులు అమృతం, ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుల పరమేశ్వర్, సీసీలు రవి, సంజీవ్‌కుమార్, తదితరులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**కంగ్టి, డిసెంబర్ 8, ప్రభాతవార్త:** కంగ్టి మండల పరిధిలోని తడ్కల్ గ్రామానికి చెందిన అశోక్ గౌడ్ భార్య సౌజన్య ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయం నిధి ద్వారా 19,500 రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కును, అలాగే బాన్సవాడ గ్రామానికి చెందిన గైని బాలయ్య కుమారుడు లాలయ్యకు 17,000 వేల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి చేతుల మీదుగా వారికి గురువారం నాడు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తోపాటు కంగ్టి ఎంపీపీ సంగీతవెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ పోగకుల శ్రీకాంత్, మండల కో-ఆప్షన్ సభ్యులు అహ్మద్, సర్పంచ్ మనోహర్ పాల్గొన్నారు.

## నిజమైన పేదోడికి ఇల్లు ఇవ్వాలి

**- బిఎస్పీ మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్**

**నందిగామ డిసెంబర్8,ప్రభాతవార్త :**

డబుల్ బెడ్ రూం ఇళ్ల ఎంపికలో నిజమైన పేదోడిని గుర్తించి ఇల్లు కేటాయించాలని నందిగామ మండల బిఎస్పి అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ డిమాండ్ చేశారు.ఇళ్ల ఎంపిక విషయంలో ఎమ్మార్వో,స్థానిక సర్పంచ్ లకు బాధ్యత అప్పజెపాలని కోరారు.అన్ని వర్గాల నిరుపేదలకు ,ఎస్సీ, ఎస్టీ,బిసి,మైనార్టీ ,అగ్రకులాల పేదలను గుర్తించాలని ,కులమతాలకు రాజకీయ పార్టీలకతీతంగా గుర్తిస్తేనే నిజమైన పేదలకు న్యాయం జరు గుతుందని పేర్కొన్నారు.అర్హత ఉన్న ఏ ఒక్క పేదోడికి అన్యాయం జరిగినా బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్ట వలసి వస్తుందని ఆయన హెచ్చరించారు.

## భక్తిశ్రద్ధలతో దత్త జయంతి వేడుకలు



ఆమనగల్లులోని షిర్డిసాయి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

**ఆమనగల్లు, డిసెంబర్08, ప్రభాతవార్త:**

ఆమనగల్లు పట్టణంలోని శ్రీషిర్డిసాయి ఆలయంలో గురువారం దత్త జయంతి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించా రు. జయంతి పురస్కరించుకుని ఆలయంలో పలు ప్రత్యేక కార్యక్రమా లు నిర్వహించారు. అభిషేకాలు, హోమాలు, పూజలతో ఆలయ పరిస రాలు మారుమ్రోగాయి. వేడుకలకు పలు ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరైనారు. ఆలయ పూజారులు మధుసూధనశర్మ నేతృ త్వంలో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. జయంతి వేడుకల సంధ ర్భంగా ఆలయాన్ని పుష్పాలతో అలంకరించారు. తెల్లవారుజాము ప్రత్యే క పూజా కార్యక్రమాలతో వేడుకలు ప్రారంభించారు. భక్తులు ఆలయా నికి చేరుకుని షిర్డిసాయినాథుని దర్శించుకున్నారు. కార్యక్రమానికి ప్ర ముఖ సంఘ సేవకులు పాపిశెట్టి రాము, రవికిరణ్, రంజిత్ పాండె. నయనాచారి, పంపు ప్రకాష్, ఉప్పల రాములు, పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను చేరవేయడంలో సర్పంచ్‌లు సమయస్ఫూర్తితో మెలగాలి

**-డబిల్‌పూర్ సర్పంచ్ గీతభాగ్యరెడ్డి**



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న గీతా భాగ్యరెడ్డి సర్పంచ్

**మేడ్చల్, డిసెంబర్ 8. ప్రభాతవార్త :**

ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అబివృద్ది పథకాలను ప్రజలకు చేరవేయ డంలో సర్పంచ్‌లు సమయస్ఫూర్తితో మెలిగి, ప్రజలతో మమేకం అవ్వాలని డబిల్ పూర్ గ్రామ సర్పంచ్ గీత భాగ్యరెడ్డి అన్నారు. నగరంలోని రాజేంద్రనగర్‌లో గల నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయ తీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సర్పంచ్‌ల శిక్షణా కార్యక్రమంలో భాగంగా లడఖ్ ప్రాంతానికి చెందిన 30 మంది మహిళా సర్పంచ్‌లకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో గురువారం మేడ్చల్ మండలంలోని డబిల్‌పూర్ సర్పంచ్ గీత ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె శిక్షణా తరగతుల అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అబి. వృద్ది పథకాలు ప్రజల వద్దకు చేరుతున్నాయని వివరించారు. ఈ నెల 14 తేదీ వరకు శిక్షణా తరుగతులు జరుగుతాయని, ఈ శిక్షణా తరగతుల్లో భాగంగా సర్పంచ్‌లు గ్రామాల్లో పర్యటించి పథకాలు ప్రజలకు ఎలా చేరు తున్నాయో తెలుసుకుంటారని ఆమె తెలిపారు.

### ఫిట్‌నెస్ వరల్డ్ జిమ్‌ను ప్రారంభించిన ఛైర్మన్ రాజేశ్వర్‌రావు

**శామీర్‌పేట, డిసెంబరు 8, ప్రభాతవార్త**

తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని జానకి ఎంక్లేవ్ కాలనీలో కాయిజెన్ ఫిట్‌నెస్ వరల్డ్ జిమ్‌ను తూంకుంట మున్సిపాల్టీ ఛైర్మన్ కె.రాజేశ్వర్ రావు ప్రారంభించారు. గురువారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని జానకి ఎంక్లేవ్ కాలనీలో జిమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగ ఛైర్మన్ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ జిమ్‌లు శారీరక దారుఢ్యాన్ని, మనోధైర్యాన్ని, ఆలోచనా శక్తిని పెంచు తుందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.కృష్ణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ ఎంపిపి కామిడి మణెమ్మ మృతి

**-ప్రగాఢ సంతాపం తెలిపిన ప్రజాప్రతినిధులు,నాయకులు**

**శామీర్‌పేట, డిసెంబరు 8, ప్రభాతవార్త**

శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ ఎంపిపి కామిడి మణెమ్మ (మూడు చింతలపల్లి) అనారోగ్యంతో ఉండి గురువారం మృతిచెందారు. మూడు చింతలపల్లి గ్రామ మాజీ సర్పంచు కామిడి మధుసూదన్‌రెడ్డి సతీమణి శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ ఎంపిపి కామిడి మణెమ్మ మధుసూదన్‌రెడ్డి గత నెల రోజుల నుంచి అనారోగ్యంకు గురై గురువా రం ఉదయం మృతిచెందారు. ఆమె ఐదేళ్ల పాటు శామీర్‌పేట ఉమ్మడి మండల ఎంపిపిగా గతంలో కొనసాగారు. శామీర్‌పేట ఉమ్మడి మండ లంలో మంచి గుర్తింపును పొందటం జరిగింది. మణెమ్మ మృతిచెందిన సమాచారం అందుకున్న పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు అల్వాల్‌లోని ఆమె నివాసంకు చేరుకుని ప్రగాఢ సంతాపం తెలియజేశారు. బాధిత కుటుంబానికి పలువురు ప్రగాఢ సానుబూతిని తెలియజేశారు. మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్, ఎంపిపల్లి మండల జడ్పీటిసి ఎస్.హరివర్ధన్‌రెడ్డి ఆమె నివాసరంకు వెళ్లి పార్థీవ దేహం వద్ద ప్రగాఢ సంతాపం తెలియజేశారు. మాజీ సర్పంచు కె.మ ధుసూదన్‌రెడ్డిని, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానూ బూతిని తెలియజేశారు. అల్వాల్‌లో ఆమె అంత్యక్రియలు గురువారం మధ్యాహ్నం నిర్వహించారు. దీనిలో శామీర్‌పేట ఉమ్మడి మండల పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, మూడుచిం తలపల్లి గ్రామానికి చెందిన పలువురు పాల్గొన్నారు.



శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ ఎంపిపి కామిడి మణెమ్మ అనారోగ్యంతో ఉండి మృతిచెందటంతో పార్థీవదేహం వద్ద ప్రగాఢ సంతాపం తెలిపిన మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్,ఎంపిపల్లి మండల జడ్పీటిసి ఎస్.హరివర్ధన్‌రెడ్డి,పాల్గొన్న తదితరులు

# అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

**-ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తా -ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి**

**కొడంగల్,డిసెంబర్ 8ప్రభాతవార్త**

కొడంగల్ పట్టణ శివారులోని బండల ఎల్లమ్మ దేవాలయ సమీపంలో శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి ఆలయ నిర్మాణ భక్తులు భూమిపూజ నిర్వహించారు.దాతల సహకారంతో సుమారు రూ.60లక్షలకు పైగా వ్యయంతో నిర్మించే ఆలయ నిర్మాణానికి బుధవారం డిప్యూటీ డిఎంహె చ్ఓ డాక్టర్ రవీంద్రయాదవ్ అద్వర్యంలో శాస్త్రోక్తంగా భూమిపూజ కార్యక్రమా న్ని నిర్వహించారు.అర్చకుల వేదమంత్రాల మద్య అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భూమి పూజలో పాల్గొన్నారు.అయ్యప్ప స్వామి కీర్తనల తో అయ్యప్ప భక్తులు హోరెత్తించారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.ఈ సందర్బంగా రవీంద్రయాదవ్ మాట్లాడుతు ఈనెల 13న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ ప్రాంతంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆద్వర్యంలో అయ్యప్పస్వామి మహాపడిపూజా కార్య క్రమాన్ని నిర్వహించను న్నట్లు పేర్కొన్నారు.కాగా అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ భూమిపూజలో



అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణ భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్ మధుసుదన్‌యాదవ్‌లు పాల్గొన్నారు.ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతు అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి తనవంతు సహయ సహకారాలు అందిస్తానన్నారు.ఈ సందర్బం గా ప్రతి ఒక్కరు దైవ చింతనను అలవర్చుకోవాలన్నారు.పూజా కార్య క్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు కానుకుర్తి నర్సిరెడ్డి,శ్రీనివాస్‌గౌడ్, గోపాల్,ఉమా పతిగౌడ్,అచ్చుతారెడ్డి,బుక్క రాజు,డాక్టర్ సాకేత్, జగదీశ్‌ధాగ, కిషన్‌ధా గ,అనంద్‌లాహోటీలతో పాటు పట్టణవాసులు తదతరులు పాల్గొన్నారు.

# ఘనంగా బిజెపి నాయకుల సంబరాలు

**- ఇక మిగిలింది తెలంగాణలోనే అంటున్న నాయకులు**

**షాద్‌నగర్, డిసెంబర్ 8, (ప్రభాతవార్త) :**

భారతీయ జనతాపార్టీ గుజరాత్ ఎన్నికల్లో విజయ ధుంధుభి మ్రోగించడంతో గురువారం షాద్‌నగర్ పట్టణంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు విజయో త్సవ సంబరాలు జరుపుకున్నారు. షాద్‌నగర్ ముఖ్యకూడలిలో ప్రధాని నరేం ద్రమోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, బాణా సంచాలు కాల్చుతూ ఒకరికి ఒకరు మిఠాయిలు తినిపించుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ... బీజేపీ అందిస్తున్న సుపరిపా లన వల్లనే విజయం సాధ్యమైందని, గుజరాత్‌లో వరుసగా 7వ సారి ప్రజలు బీజేపీ పట్టం కట్టారని వారు ఆనందం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో సహితం తెలంగాణలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. గుజరాత్‌లో విజయం సాధించామని, ఇక మిగిలింది తెలంగాణ అని వారు పేర్కొన్నారు. కుటుంబ పాలనకు చరమ గీతం పాడుతూ సుపరిపాలన అందించడానికి బీజేపీ సిద్దమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లి ఆశోక్‌గౌడ్, సినియర్ నాయకులు కందూరి



షాద్‌నగర్‌లో సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు.

మనోహర్‌రెడ్డి, కక్కునూరి వెంకటేష్‌గుప్త, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, మహ బూబ్‌నగర్ పార్లమెంటు కో ఇంఛార్జీ అమడపురం నర్సింహా, పట్టణ అధ్యక్షు డు మఠం ఋషికేష్, కేశంపేట పార్టీ అధ్యక్షుడు నర్సింహా, చెట్ల వెంకటేష్, వంశీకృష్ణ, మోహన్‌సింగ్, లష్కర్‌నాయక్, గజాల ప్రవీణ్, మురళీధర్‌రెడ్డి, పిట్టల సురేష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ తీగలను తొలగించాలంటూ ఆందోళన

**-రోడ్డుపై కాలనీవాసులు బైఠాయింపు -ఎమ్మెల్యే హమీతో ఆందోళన విరమణ**



రోడ్డుపై భైఠాయించి ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

**కొడంగల్,డిసెంబర్ 8ప్రభాతవార్త**

కొడంగల్ పట్టణంలోని కార్గిల్‌కాలనీలో ఇళ్ళపై నుంచి వేలాడుతున్న విద్యుత్ తీగలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తు గురువారం కొడంగల్ పట్ట ణంలోని కార్గిల్‌కాలనీ వాసులు మార్కెట్‌యార్డు సమీపంలోని తాండూర్- మహబుబ్‌నగర్ రోడ్డుపై భైఠాయించి ఆందోళన చేపట్టారు.ఇళ్ళపై నుంచి వేలాడుతున్న ఎల్‌టీలైన్ విద్యుత్ వైర్లతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుం టున్నాయని,అందులో భాగంగా గురువారం కాలనీకి చెందిన శమీమ్ తన ఇంటికి సున్నం వేస్తున్న క్రమంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి తీవ్ర గాయాలైయ్యాయని వాపోయారు.ప్రమాదభరితంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను తొలగించాలని పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా ఎలాంటి ఫలితం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యుత్ తీగలను తొలగించే వరకు ఆందోళన విరమించేది లేదని రోడ్డుపై భైఠాయించారు.దీంతో విషయం



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తెలుసుకున్న మున్సిపల్ కౌన్సిలర్ మధుసుదన్‌యాదవ్ అక్కడికి చేరుకొని సంఘటన వివరాలను ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి ఫోన్ ద్వారా వివరించారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తు విద్యుత్ తీగలను తొలగించేందుకు చర్యలు తీసు కుంటానని హమీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.అనంతరం కొడంగల్‌కు చేరుకున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి నేరుగా బాధితుడి ఇంటికి చేరుకొని జరిగిన సంఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే శమీమ్‌కు విద్యుత్‌షాక్‌తో తీవ్ర గాయాలైయ్యాయని క్షతగాత్రుడి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతు సత్వరమే విద్యుత్ తీగలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు.అలాగే విద్యుత్ షాక్‌కు గురైన శమీమ్‌కు హైద్రాబాద్‌లోని గాంధీఆసుపత్రి లేదా నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందించడంతో పాటు కుటుంబానికి అండగా నిలుస్తానని హమీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నాయకులు మాజీ సర్పంచ్ రమేష్‌బాబు, నరోత్తం రెడ్డి,సర్పంచ్ చాంద్‌పాషా,నవాజ్‌లతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఏఎస్సైపై దుర్బాషలాడిన వ్యక్తులపై కేసు నమోదు

**-నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు**

**-ఎస్సై రవిగౌడ్**

**కొడంగల్,డిసెంబర్ 8ప్రభాతవార్త**

విధి నిర్వహణలో భాగంగా పెట్రోలింగ్ విధుల్లో ఉన్న ఏఎస్సైను దుర్బాషలాడిన వ్యక్తితో పాటు నిబంధనలను అతిక్రమిస్తు ఎలాంటి అనుమతి లేకుండా డిజే (సౌండ్‌బాక్స్)తో డ్యాన్స్‌లు చేసిన వారిపై కేసు నమోదు చేసిన సంఘటన కొడంగల్‌లో బుధవారం రాత్రి చోటుచేసుకుంది.సంఘటనకు సంభందించి ఎస్సై రవిగౌడ్ కథనం మేరకు..బుధవారం రాత్రి కొడంగల్ పట్టణంలోని వడ్డర్‌గల్లీలో ఎలాంటి అనుమతి లేకుండా డీజే(సౌండ్‌బాక్స్)పెట్టి కొంతమంది డ్యాన్స్ చేస్తున్న క్రమంలో అదే సమయంలో పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న ఏఎస్సైతో పాటు పోలీసు సిబ్బంది వారి దగ్గరకు వెళ్ళి డిజే నడపడానికి పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఏమైనా అనుమతి తీసుకున్నారా అని అడగడం జరిగిందన్నారు.అదే సమ యంలో వినోద్‌గౌడ్ ఏఎస్సైను దుర్బాషలాడుతు డీజేను పోలీసుస్టేషన్‌కు తీసుకు వెళ్ళనివ్వకుండా నిలవరిస్తూ నానా హంగామా సృష్టించడం జరిగిందన్నారు. సంఘటనపై వినోద్‌గౌడ్‌తో పాటు ఎలాంటి అనుమతులు లేకుండా డీజే సౌండ్ యజమానిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.అలాగే అనుమతులు లేకుం డా నడిపిన డిజేను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా డీజే పెడుతు నిబంధనలను అతిక్రమించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై తెలిపారు.

## కొనసాగుతున్న మోది ప్రభంజనం

**-రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు**

**కుల్కచర్ల డిసెంబర్ 08,ప్రభాతవార్త :**

దేశ ప్రదాని మోది ప్రభంజనంతో గుజరాత్ ఎన్నికల్లో బిజెపి విజయకేతనం ఎగురవేసిందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సబ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు అన్నారు. గురువారం వికారాబాద్ జిల్లా కుల్చర్ల మండల కేంద్రంలో బాణాసంచా పేలుస్తూ, స్వీట్లు పంచుతూ సంబురాలు చేసుకున్నారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడు తూ 1995లో 121 సీట్లతో ప్రారంభమైన బిజెపి ప్రస్థానం అంచెలంచలుగా ఎదిగి నేడు ఏడవసారి మోది ప్రభంజనంతో 156 సీట్లు కైవసం చేసుకుందని తెలిపా రు.నరేంద్రమోది చేస్తున్న అభివృద్ది కార్యక్రమాలకు ఆకర్షితులై ప్రజలు బిజేపి జెండా ఎగురవేశారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రదాన కార్యదర్శి ఘనపురం వెంకటయ్య,మండల పార్టి అద్యక్షుడుగాదె మహిపాల్ ముది రాజ్,గిరిజన మోర్చా నాయకుడు మాజి సర్పంచ్ జానకిరామ్,జిల్లా ఎస్‌సి మోర్చా ప్రదాన కార్యదర్శి శ్రీనివాస్,ఒబిసి మోర్చా జిల్లా ఉపాద్యక్షుడు చంద్రలిం గం,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కాటన్‌పల్లి అంజిలయ్య,మైనారిటి మోర్చా జిల్లా ప్రదాన కార్యదర్శి రుక్మద్దిన్,యువమోర్చా అద్యక్షుడు గడుసు మహిపాల్,ఒబిసి మోర్చా మండల అద్యక్షుడు గుడలవెంకటేష్,మండల ట్రెజరర్ చెల్లాపూర్ ఆంజనే యులు,ఇప్పాయిపల్లి వెంకటయ్య,కాటన్‌పల్లి ప్రవీణ్,సోషల్ మీడియా కన్వీనర్ భైరం నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### క్రీడాభిమానులతో క్రియాశీలక అయ్యేందుకు అవకాశం

నాగారం డిసెంబర్8,ప్రభాతవార్త :క్రీడా ప్రసారాలను తిరిగి ప్రారంభిస్తున్న నేప థ్యంలో జనవరిలో యుఏఈలో నిర్వహించనున్న జి ఐఎల్‌టి 20 ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించి ఉత్సాహకరమైన కొత్త క్యాంపెయిన్‌ను జీ ప్రారంభిం చింది.ఇందులో ప్రముఖ క్రికెటర్ వీరేందర్ సెహ్వాగ్ ఉండగా ,ఇది టి 20 పోటీల తీవ్రతకు ఉత్తేజకరమైన గింపిల్స్‌ను అందించనుంది.ఈ వాణిజ్య చిత్రంలో ఐఎల టి 20 లీగ్‌ను సెహ్వాగ్ వ్యక్తిత్వంతో సంయోజన చేయడం ద్వారా కుతూహలాన్ని పుట్టిం చేలా ఉంటుందని.క్రికెట్‌కు జీ తిరిగి రావడం అంటే క్రీడాభిమానులతో క్రి యాశీలకం అయ్యేందుకు అవకాశం లభిస్తున్నందుకు ఉత్సుకతను గురవుతున్నారని పేర్కొంది.

## ఎన్ఎన్ఆర్‌లో మహిళా భద్రతపై అవగాహన సదస్సు




చౌదరిగూడ నల్లనర్సింహ్మారెడ్డి కళాశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న షీటీం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి

**ఘట్‌కేసర్, డిసెంబర్ 8, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ సమీపంలోని నల్ల నర్సింహ్మారెడ్డి కళాశాలలో గురువారం మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులపై షీటీం అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. రాచకొండ పోలీ స్ షీటీం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈసదస్సులో షీటీం ఎస్ఐ కె.కరు ణాకర్‌రెడ్డి హజరై మహిళా అధ్యాపకురాళ్లు, వివిధ విభాగాల మహిళా ఉద్యోగినులకు ప్రివెన్షన్, ప్రొహిబిషన్, రెడ్రెస్సల్ చట్టం-2013పై అవగాహన కల్పించారు. సమాజంలో వివిధ రకాలుగా మహిళలపై భౌతికంగా, డిజిటల్ ద్వారా జరుగుతున్న లైంగిక దాడులను ఎదుర్కొనే విషయాలపై తెలియజేశారు. ఐపీసీ 354 ఎ, బి, సి, డిలపై ఆన్‌లైన్ సైబర్ నేరాలపై వివరించారు. ఈకార్యక్రమంలో మహిళా విభాగం ఇం చార్జ్ డాక్టర్ రెష్మి, పలు విభాగాల డీన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### అథ్లెటిక్స్‌లో భూంపల్లి విద్యార్థికి సిల్వర్ మెడల్

**మిరుదొడ్డి, డిసెంబర్ 8, ప్రభాతవార్త:** గతనెల రాష్ట్రంలో నిర్వహిం చిన అండర్-14 విభాగం హైజంప్‌లో సిద్దిపేట జిల్లాలో మొదటి స్థానం లో నిలి చిన భూంపల్లి విద్యార్థి నందు మెరిట్ అధారంగా స్టేట్‌లో సెలక్ష న్ అయ్యారు. తెలంగాణ మొత్తం 33 జిల్లాల నుంచి విద్యార్థులు హై జంప్ పోటీలో పాల్గొన్నారు. అందులో బుధవారం హైదారాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన హై జంప్ పోటీలో బోయిని నందు 1.51 మిటర్స్ జంప్ చేసి తెలంగాణలో రెండవ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకట య్య నందును, తల్లిదండ్రులను శాలువాతో ఘనగా సత్కరించారు.

### సిద్దిపేటలో సమీకృత మార్కెట్ యార్డు

**రూరల్, డిసెంబర్ 8, ప్రభాతవార్త :**

సిరిసిల్ల అగ్రికల్చర్ కాలేజీ బిఎస్సీ థర్డ్ ఇయర్ విద్యార్థులు, ప్రొఫెస ర్లు తమ ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రం లోని సమీకృత మార్కెట్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ నాయకులు మచ్చ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మార్కెట్‌లో గల సౌకర్యాలను వారు తిలకించారు. రైతుల యొక్క కూరగాయల వేలం పాటను చూసి సంతోషం వ్యక్తం చేశారు. నిష్పక్షపాతం జరుగు తున్న వేలం పాట వారిని మరింత ఉత్సహపరిచింది. మార్కెట్ అదాయ వ్యయాలు, మార్కెట్ నిర్వహణ అడిగి తెలుసుకున్నారు. చేపల, మటన్ మార్కెట్‌లో గల సౌకర్యాలు, మహిళలకు మార్కెట్‌లో ఉన్న సౌకర్యాలు, మంచి నీటి సదుపాయాన్ని చూసి సంతోషం వ్యక్తం చేశారు. సిద్దిపేటలో అధునాతనసౌకర్యాలతో మార్కెట్ ఉందని విద్యార్థులు,ప్రొఫెసర్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో మచ్చ వేణుగోపాల్‌రెడ్డి,విద్యార్థులు ఉన్నారు.

## ఛైర్‌పర్సన్, కమిషనర్‌లకు వడ్డెర సంఘం సన్మానాలు

**-వడ్డెరుల సంక్షేమానికి సహకరించాలి విజ్ఞప్తి**



ఘట్‌కేసర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పావనియాదవ్, కమీషనర్ వేమనరెడ్డిలను సన్మానిస్తున్న వడ్డెర సంఘం అధ్యక్షులు వెంకటేశ్ తదితరులు

**ఘట్‌కేసర్, డిసెంబర్ 8, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, కమీషనర్ వేమనరెడ్డిలను గురువారం ఘట్‌కేసర్ మండల వడ్డెర సంక్షేమ సంఘం నాయకు లు సన్మానించారు. ఘట్‌కేసర్ పురపాలక సంఘం కార్యాలయంలో మండల వడ్డెర సంఘ ం అధ్యక్షులు శివరాత్రి వెంకటేశ్ ఆధ్వర్యంలో వారిని శాలువాలతో సత్కరించారు. వడ్డెరల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఇటీవల వడ్డెర సంఘం అధ్యక్షులుగా వెంకటేశ్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా మున్సిపల్ ఛైర్‌పర్సన్‌తో పాటు అధికారులను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి వడ్డెర సంఘం చేపడుతున్న పనులపై చర్చించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిరుపేద వడ్డెరలకు అందేలా అధికారులు, ప్రజాప్రతి నిధులు చొరవ చూపాలని వెంకటేశ్ వారిని కోరారు. ఈసందర్భంగా మున్సిపల్ మేనేజర్ మర్రి అంజిరెడ్డి, కౌన్సిలర్ బండారి అంజనేయులుగౌడ్‌లను కూడా సన్మానించారు. ఈకార్యక్రమంలో వడ్డెర సంఘం మాజీ అధ్యక్షులు బోదాసు వెంకటేశ్, ఉపాధ్యక్షులు మ్యాగని నర్సింగ్‌రావు, సభ్యులు మక్కల మహంకాళీ, బోదాసు మల్లేశ్, పల్లపు బాలమల్లేశ్, మ్యాగని రమేశ్, మక్కల శ్రీకాంత్, మ్యాగ ని శ్రీకాంత్, దాసర్ల వెంకటేశ్, వరికుప్పల యాదయ్య, ముద్దంగుల అంజనే యులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఐక్యత చేయూత



బాధిత కుటుంబానికి సహాయం చేస్తున్న దృశ్యం

**ఆమనగల్లు, డిసెంబర్08, ప్రభాతవార్త:**

ఆమనగల్లు పట్టణంలోని 14వ వార్డుకు చెందిన గన్నోజు లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ మూడు రోజుల క్రితం కన్నుమూసింది. ఐక్యత ఫౌండేషన్ ప్రతిని ధులు గన్నోజు సత్యం, మన్న గిరిల ఆధ్వర్యంలో గురువారం బాధిత కుటుంబా న్ని పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఫౌండేష న్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన రూ. 5వేల రూపాయలను బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### ఫార్మారంగంలో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఫార్మారంగ నిపుణులు విజయ్‌కుమార్

**ఘట్‌కేసర్, డిసెంబర్ 8, ప్రభాతవార్త:** ఔషధరంగంలో ఉన్న విద్యార్థులకు ఉజ్వ ల భవిష్యత్తు ఉంటుందని ప్రముఖ ఫార్మా రంగ నిపుణులు డాక్టర్ గంప విజయ్ కుమార్ అన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సీనగర్ సమీపం లోని మదర్‌థెరిస్సా ఫార్మసీ కళాశాలలో గురువారం బి-ఫార్మసీ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్ర మానికి ముఖ్యఅతిథులుగా ఫార్మ రంగ నిపుణులు డాక్టర్ గంప విజయ్‌కుమార్, చిన్నాల క్రిష్ణమోహన్‌లు హజరై ఔషధ రంగంలో ఉద్యోగ అవకాశాలు చాలా ఉంటాయని తెలిపారు. ఆసుపత్రులు, ప్రయోగశాలలు, మందుల పరిశ్రమలు తదితర చోట్ల బి-ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులకు అవకాశాలు వస్తాయని పేర్కొ న్నారు. ఫార్మా రంగం ప్రాధాన్యత, విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, ప్లేస్‌మెంట్‌లపై వారు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిధులను కళాశాల యాజమాన్యం శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈకార్యక్రమంలో మదర్‌థెరిస్సా విద్యాసంస్థల కార్యదర్శి పి.సోమశేఖర్, ప్రిన్సిప ల్ డాక్టర్ కిరణ్‌కుమార్, వైస్‌ప్రిన్సిపల్ టి.రాంచందర్, విభాగాధిపతి డి.రాజ్ కుమార్, అధ్యాపకులు పి.ప్రఫుల్లా, సంతోష్, జీనత్‌రూహీ, జి.విజయ్‌కుమార్, ఎ.సురేశ్‌కుమార్‌యాదవ్, రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తికి తీవ్ర గాయాలు

**కొడంగల్ రూరల్, డిసెంబర్ 6 (ప్రభాతవార్త)ః**

విద్యుత్ షాక్‌తో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన కొడంగల్‌లో జరిగింది. వివరాల్లోకి వెళితే...కొడంగల్ మున్సిపాలిటి పరిధిలోని కార్గీల్‌కాలనీలో షమీమ్ అనే వ్యక్తి గురువారం ఉదయం తన సొంత ఇంటికి పెయింటింగ్ వేస్తుండగా ఇంటిపై ఉన్న 33 కేవీ విద్యుత్ తీగలు తగలడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు, కాలనీవాసులు చికిత్స కోసం కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ లోని గాంధీ ఆసుపత్రికి వైద్యులు రెఫర్ చేశారు. అంతకు ముందు ఈ సంఘటన జరగడంతో కాలనీవాసులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ విషయం తెలుసుకున్న కౌన్సిలర్ మధుయాదవ్ అక్కడికి చేరుకొని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో ఎమ్మెల్యే కార్గీల్ కాలనీలో బాధిత కుటుంబ సభ్యులు, కాలనీవాసులతో ప్రమాదంపై ఆరా తీశారు. హైటెన్షన్ విద్యు త్ తీగలను తొలగించేందుకు విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.

## భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

**డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్**

**మిరుదొడ్డి, డిసెంబర్ 8, ప్రభాతవార్త:**

స్వేచ్ఛ సమానత్వం సొదరభా వాన్ని అందించిన భారత రాజ్యాంగా న్ని కాపాడుకోవాలని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ పిలుపునిచ్చారు. 73వ భారత రాజ్యాంగ దినోత్సవం నుంచి జనవరి 26 గణతంత్ర దినోత్స వం వరకు డిబిఎఫ్ చేపట్టిన భారత రాజ్యాంగ ప్రచారోద్యమ కరపత్రాలను గురువారం అక్బర్‌పేట-భూంపల్లి మండలకేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ద్వేషాన్ని వ్యతిరేకిస్తూ భారత రాజ్యాం గ పరిరక్షణకు ఉద్యమంలో ప్రతి ఒక్క రూ మమేకం కావాలన్నారు. భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్దంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఇడబ్ల్యుఎస్ పదిశా తం రిజర్వేషన్‌లను రద్దు చేయా లన్నారు. బిజెపి రాజ్యాంగ వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలన్నారు. కార్యక్రమంలో దుబాషి సంజీవ్, భూం పల్లి మధు, నరేష్, రాజు లెనిన్, స్వా మి, కృష్ణహరి, గణేష్, లక్ష్మణ్, పర్శరా ములు తదితరులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE, CUM IV M.M.MEDCHAL MALKAJIGIRI DISTRICT. AT : L.B.NAGAR**
**O.S.NO. 1630 OF 2022**

**Between :**
1. Smt. Chandra kala More W/o. M.Bishmadev late Aged 70 years, Occ: House wife.
2. Suryadev More S/o. Late Bishmadev More Aged about 53 years Occ: Pt. service. All R/o. 3-3/2, Balaji Nagar, Ghatkesar (V&M) Medchal Malkajigiri District. 501301.
...**Plaintiff**
**And**
1. Md.Mannan Khan S/o. Mahafooz Khan, Aged about 33 years Occ. Business, R/o. 8-177, Brooks Bond Colony, Ghatkesar (V&M), Medchal District. 501301.
To,
All Concerned-D2
...Defendants

The general public where as the petitioners filed an application for suit for declaration to declare the plaintiffs as absolute legal heirs of suit property against the respondents and the same is posted to 13/12/2022 by the honourable court for consideration as such if any persons as got any claims, interest or objections may appeal before the honourable court in person or by pleader on 13/12/2022 at 10.30 A.m. failing which the application would be decided on merits by this honourable court.

**SCHEDULE OF PROPERTY**
All that the Land bearing Plot No.395, admeasuring 216 Sq. yards and in Sy.no. 123, 124, 125 situated at Ghatkesar Village and Mandal, Medchal Malkajigiri District (Old. R.R.Dist), through Registered Sale Deed bearing document No. 5740/2003 Dated 30/5/2003, Situated at Ghatkesar Village and Mandal, Medchal Malkajigiri District (Old. R.R.Dist) and bounded by : NORTH :: Plot No. 396. SOUTH :: Road. EAST :: 40' wide road. WEST :: Plot No.394.
**//BY ORDER OF THE HONOURABLE COURT)**
**M/s. P.Chandrashekar**
Advocate
R/o. Flat No. 108, 1st floor, Yadadri residency P.S.Road, Ghatkesar (V&M) Medchal district.
**Ph: 9848371083**

## అంగరంగ వైభవంగా మాణిక్ ప్రభు ఉత్సవాలు


భజనలో పాల్గొన్న ఆయా గ్రామాల భక్తులు

**పెద్దేముల్, డిసెంబరు 8, ప్రభాతవార్త:**
పెద్దేముల్ మండల కేంద్రంలో మాణిక్ ప్రభు దేవాలయంలో మాణిక్‌ప్రభు ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకొని మాణిక్‌ప్రభు దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. కొండూర్ మాణిక్యం అధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల సందర్భంగా స్వామి వారిని ఊరేగించిన అనంతరం బుధవారం రాత్రి నిర్వహించిన భజన కార్యాక్రమాలలో మంబాపూర్, పెద్దేముల్, జనగాం గ్రామాల భజన బృందాలు పాల్గొన్నాయి. గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు డివై నర్సిములు, గణేష్, ఆనందచారీ, కొందూరు శ్రీనివాస్, జనగాం శివకుమార్, నరహరి, మల్లప్ప, సంజీవ్, మంబాపూర్‌ప్రసాద్‌గౌడ్, టి.రాములు, విజయ్‌కుమార్, సిహెచ్ నర్సిములు, కమ్మరి శ్రీనివాస్, గొబ్బురు గోపి, జె.నర్సిములు, వై.రాములు, వై.లాలప్ప, కె.శ్రీనివాస్, బంటారం భీమప్ప తదితరులు పాల్గొన్నారు.

## గాజీపూర్‌లో ఊరడమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు


ముస్తాబైన ఊరడమ్మ దేవాలయం

**పెద్దేముల్, డిసెంబరు 8, ప్రభాతవార్త:**
పెద్దేముల్ మండలంలోని గాజీపూర్‌లో ఊరడమ్మ నూతన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు మూడు రోజులు పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు. ఈ నెల 10న శనివారం ఉదయం 9.00 గంటలకు వీరభద్రేశ్వర దేవాలయ నుంచి అమ్మవారి విగ్రహం, కలిషం, దేవత ప్రతిష్టాపన స్థలం వరకు ఊరేగింపు, 11న ఆదివారం ఉదయం 8.00 గంటలకు గణపతి పూజ, హోమం, దాన్య దివాసం, రాత్రి బండమీదిపల్లి గ్రామ భజన బృందంచే భజన కార్యక్రమాలు, 12న సోమవారం ఉదయం 7.15 గంటలకు గణపతి పూజ, చండి హోమం, యంత్ర స్థాపన, ఊరడమ్మ విగ్రహ ప్రతిష్టాపన అనంతరం మధ్యాహ్నం 12.00 గంటలకు అన్నదాన కార్యక్రమం, మధ్యాహ్నం 2.00 గంటలకు బోనాలు, రాత్రి కర్ణాటక వారిచే భజన కార్యాక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమీటి సభ్యులు, గ్రామపెద్దలు తెలిపారు.

## వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి
**-జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్**


కొనుగోలు కేంద్రంను పరిశీలిస్తున్న అధికారులు

**బొంరాస్‌పేట్, డిసెంబర్8, ప్రభాతవార్త ః**
వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, ఎఓ పద్మావతి గురువారం నాడు కోత్తూర్ వరి కొనుగోలు కేంద్రంను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో ధ్యానం కొనుగోలు వివరాల రిజిస్టర్‌ను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి ధాన్యం కొనుగోలు చేయాలని నిర్వహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఈఓ రేణుక, రైతులు, కొనుగోలు కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు సిఎం సహాయనిధి కొండంత అండ
**-ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి**


.ఎల్‌ఓసీ అందిస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

**బొంరాస్‌పేట్, డిసెంబర్8, ప్రభాతవార్త ః**
పేద కుటుంబాలకు కొండంత అండ ముఖ్యమంత్రి సహాయనిధి అని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం నాడు హైదరాబాద్ లోని అయన నివాసంలో బొంరాస్‌పేట్ మండలం ఏర్పుమళ్ళ గ్రామానికి చెందిన కోట్ల వెంకటయ్య తండ్రి రామయ్య కుటుంబానికి ఎల్‌ఓసీ ద్వార 3లక్షల 50వేల రూపాయాల చెక్కును అందించడం జరిగిందన్నారు. పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా ఉంటుందన్నారు. అనారోగ్యానికి గురైై ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద కుటుంబాలకు అయ్యే ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్, శేఖర్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఏట్ల ఎర్రవల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

**షాబాద్, డిసెంబర్ 8, ప్రభాతవార్త :**
వెనుకబడిన ఏట్ల ఎర్రవల్లి పంచాయతీలో మౌలిక సదుపాయాలు కల్పించి అన్ని రకాలుగా అభివృద్ది చేద్దామని షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి తెలిపారు. గురువారం టీఆర్‌ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఏట్ల ఎర్రవల్లిని సందర్శించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ.... వెనుకబడిన ఏట్ల ఎర్రవల్లి పంచాయతీలో మౌలిక సదుపాయాలు కల్పించి అన్ని రకాలుగా అభివృద్ది చేద్దామన్నారు. అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలించి, మరమ్మత్తులు చేస్తారని అన్నారు. అనంతరం మద్దూర్ కిష్టయ్య భూమి పొలం నుండి మూలమండ వాగు వరకు రూ.7లక్షల నిధులతో ఓపెన్ డ్రైనేజీ నిర్మానం పనులు ఆయన ప్రారంభించారు. ఈకార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీమాజీ చైర్మెన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు పీసరి సతీష్‌రెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ సుమిత్ర, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, మాజీ సర్పంచ్ మద్దూర్ కిష్టయ్య, టీఆర్‌ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు అర్జున్, వార్డు సభ్యులు వెంకటయ్య, వినయ్‌గౌడ్, జంగయ్య, భీమయ్య, శ్రీను, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.


అండర్ డ్రైనేజ్ పనులను ప్రారంభిస్తున్న జడీ ్పటీసీ అవినాష్‌రెడ్డి

# ప్రజాప్రతినిధులంటే అధికారులకు చులకనగా మారారు

**-మేడ్చల్ మండల పరిషత్ సర్వసభ్యం సమావేశం**
**-అధికారులపై ప్రజాప్రతినిధులు ధ్వజం**


సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎంపిపి రజిత రాజమల్లారెడ్డి

**మేడ్చల్, డిసెంబర్ 8. ప్రభాతవార్త ః**
ప్రజా ప్రతినిదులంటే అధికారులకు చులకనగా మారారని ప్రజా ప్రతినిధుల సమస్యలు పట్టించుకోకపోతె అధికారులు ఎవరికోసం పని చేస్తారని అధికారులపై మూకుమ్మడిగా గురువారం మేడ్చల్ మండల పరిషత్ సమావేశంలో ద్వజమెత్తారు. మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిపి రజిత రాజమల్లారెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న వివిద సమస్యలపై సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళుతుండగా వారు ఆ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించడమే కాకుండ ప్రజా ప్రతినిధులను చిన్న చూపి చూస్తు పట్టించుకోకపోవడంలో అంత్యర్యమేమిటని ప్రశ్నించారు. అందులో ముఖ్యంగా గ్రామాలల్లో కరంట్ సమస్యలు ఉన్నాయని, స్థంబాలు వేయడంతో పాటు లో వోల్టేజ్ సమస్యలను పరిష్కరించాలని పలు మార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, అదే ప్రైవేట్ వెంచర్లల్లో మాత్రం ఎప్పిటికప్పుడు అడిగిన వెంటనే స్థంబాలు వేయడంలో ఆంత్యర్యమేమిటని రాజబొల్లారం తాండ సర్పంచ్ మాంగ్య నాయక్‌తో పాటు పలువురు ఆ శాఖ అధికారులను నితదీశారు. ఈ సందర్బంగా జడ్పిటిసి శైలజ మాట్లాడుతూ ఈ విషయంపై పలు గ్రామాల నుండి ఫిర్యాదులు కూడ ఉన్నాయని ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా కూడ స్థానిక అధికారులకు మాత్రం చీమకుట్టినట్లైన లేకపోవడంలో ఆంత్యమేమిటో అర్థం కావడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఇక మేడ్చల్ మండల పరిధిలో మాలుమూల గ్రామాలకు వెళ్లే బస్సులు సమయానికి రాక ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలకు సమయానికి వెళ్లలేక అవస్థలకు గురవుతున్నారని, సాయంత్రం వేళల్లో రాత్రి వరకు కూడ విద్యార్థులు ఇండ్లల్లకు చేరుకోలేకపోవడంతో సమస్యలు ఏర్పడుతున్నాయని పూడూర్ ఎంపిటిసి రఘు, ఎల్లంపేట ఎంపిటిసి కుమార్, డబిల్‌పూర్ ఎంపిటిసి హేమలత, సోమారం సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, మునీరాబాద్ సర్పంచ్ గణేష్‌తో పాటు పలువురు ఆర్టీసీ అధికారులను నిలదీశారు. ఈ విషయంలో ప్రతిసారి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అడిగినా కూడ అధికారులు అప్పికప్పుడు ఏదో సాకులు చెబుతూ తప్పించుకుంటున్నారని, తాము ఈ సమావేశంలో చెప్పడంలో లాభమేమిటని తీవ్ర స్థాయిలో ద్వజమెత్తారు. సమయపాలన పాటించకపోతే భవిష్యత్‌లో తీవ్ర పరినామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. మేడ్చల్ మండలంలో మహిళ పొదుపు గ్రూపు నాయకురాళ్లు రుణాలు తీసుకుంటే ఒక్కొక్కరి వద్ద రూ 3 వేల వరకు నేరుగా లంచం తీసుకుంటున్నారని ఈ విషయమై ఎవరికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇందులో ఉన్నతాధికారుల వాటా సైతం ఉందని అర్థమౌతున్నదని డబిల్‌పూర్ ఎంపిటిసి హేమలతతో పాటు జడ్పిటిసి శైలజ మరికొంత మంది మహిళా నాయకులు అధికారులపై మండిపడ్డారు. ఈ విషయంలో ప్రశ్నిస్తే తమను సైతం గ్రూపు నుంచి తొలగించారని పేర్కొనడం గమనార్హం. వెంటనే స్పందించిన ఎంపిడివో పద్మావతి మాట్లాడుతూ మహిళా సంఘాల్లో అవినీతి రాజ్యమేలుతున్నట్లు స్పష్టమౌతున్నదని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపిస్తామని తెలిపారు. అదే విదంగా సాధారణ ప్రసవాలను చేయడంలో శ్రీరంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విఫలమవుతున్నదని, ఇప్పటి వరకు ఎన్ని సాధారణ ప్రసవాలు చేశారో నివేదిక ఇవ్వాలని జడ్పిటిసి వైద్యాధికారిని కోరగా ఆమె వద్ద సమగ్ర నివేదిక లేకపోవడం గమనార్హం. సాక్షాత్తు ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు చెప్పినా కూడ వైద్యాధికారులు ప్రసవాల విషయంలో స్పందించక ప్రైవేట్ ఆస్పత్రులకు తరలిస్తున్నారని పలువురు సభ్యులు ఆరోపించారు. సోమారం గ్రామంలో 20 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఓ వెంచర్‌లో అసైన్ భూములను కూడ ప్లాట్లుగా మార్చివేసి విక్రహించగా, ప్రస్తుతం ఆ భూములకు పూర్వపు యజమానులకు పాసు పుస్తకాలను ఇస్తుండటంలో ఆంతర్యమేమిటని ఆ గ్రామ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి రెవెన్యూ ఆర్‌ఐ చంద్రకాంత్‌ను ప్రశ్నించగా ఈ విషయం తనకు తెలియదని సమాదానం ఇచ్చాడు. తెలియనిది సమావేశానికి ఎందుకు వచ్చినట్లు ఆర్‌ఐగా విదులేమి నిర్వహిస్తున్నారని సర్పంచ్ తీవ్ర స్థాయిలో ద్వజమెత్తాడు. ఈ కార్యక్రమంలో ఎంపిపి, జడ్పిటిసి, ఎండివోతో పాటు సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయనందరెడ్డి, సింగిల్ విండో చైర్మన్‌లు సురేష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రణదీ ప్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు, ఆయా శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలోనే మెదటిసారి గ్రామపంచాయతీకి అంబేద్కర్ పేరు

**తలకొండపల్లి డిసెంబర్8, ప్రభాతవార్త :**
రాష్ట్రంలోని అనేక గ్రామపంచాయతీలు ఉన్నప్పటికి ఎక్కడ కూడా అంబేద్కర్ పేరుతో గ్రామపంచాయతీ లేకపోవడం అందరికీ తెలిసిన విషయమే కానీ రంగారెడ్డి జిల్లాలోని తలకొండపల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గ్రామపంచాయతీ కార్యాలయం అని పేరు పెట్టడం పలువురిని ఆకర్షిస్తుంది. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో పంచాయతీ భవనం పురాతనం కావడంతో భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో నూతన భవన నిర్మాణం కోసం సర్పంచ్‌గా మొదటిసారి ఎన్నికైన పెరుమళ్ళ లలిత జ్యోతయ్య, గ్రామపంచాయతీ నూతన భవనం నిర్మాణానికి పూనుకున్నారు. గతంలో సర్పంచ్‌గా ఎన్నిక కాకముందు ఎమ్మార్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మరియు పలు దళిత సంఘాల్లో చురుకుగా పని చేసిన జ్యోతయ్య డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆలోచన విధానాన్ని అంటిపుచ్చుకొని నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఇప్పటివరకు సుమారు 40లక్షల రూపాయలు వెచ్చించారు. రంగారెడ్డి జిల్లాలో కూడా అంబేద్కర్ గ్రామపంచాయతీ అంబేద్కర్ పేరు పెట్టకపోవడంతో తలకొండపల్లి గ్రామపంచాయతీకి అంబేద్కర్ పేరు పెట్టడంతో పలువురు అభినందిస్తున్నారు. పంచాయతీ నిర్మాణానికి మొత్తం ఇప్పటివరకు 40లక్షల రూపాయలు వెచ్చించారు. గ్రామపంచాయతీ కార్యాలయంతో పాటు, మీటింగ్ హాలు, రెస్టు రూం ఏర్పాటు చేసి పలువురిని ఆకర్షిస్తుంది. భవన నిర్మాణానికి గౌతమ బుద్ధుడు, అంబేద్కర్ విగ్రహాన్ని అంబేద్కర్ విగ్రహాన్ని చేయడంతో పలువురు, చూపరులను ఆకర్షిస్తుంది. ఇప్పటి వరకు 40లక్షల రూపాయలు ఖర్చు కావడంతో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న 5లక్షల రూపాయలు, మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి తన నిధుల నుంచి 5లక్షల




రూపాయలను ఇచ్చినట్లు సర్పంచ్ లలిత జ్యోతయ్య తెలిపారు.

**నేడు ప్రారంభం**
రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని శుక్రవారం మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి రా ష్ట్ర మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మంద జగన్నాథం, నాగర్ కర్నూల్ ఎంపి పోతుగంటి రాములు, జిల్లా చైర్‌పర్సన్ అనిత రెడ్డి, జట్పిటిసి ఉప్పల వెం కటేష్, ఎంపిపి తిరుమణి నిర్మల శ్రీశైలం గౌడ్‌లు ముఖ్యఅతిథిగా హాజరువు తున్నట్లు ఆయన తెలిపారు.

## బస్తీ దవాఖానకు భూమి పూజ



**నాగారం డిసెంబర్8, ప్రభాతవార్త :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బస్తి దవాఖానాలపై ప్రత్యేక దృష్టి సాధిస్తుందని నాగారం వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 16వ.వార్డు రాజ్ సుక్ నగర్ కాలనీలో బస్తీ దావఖానకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బదనాపురం శ్రీనివాస్, 16వ.వార్డు టిఆర్‌ఎస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్, జనరల్ సెక్రెటరీ ఉపేందర్ రెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ బాల్ రెడ్డి, శ్రీకాంత్, రవిందర్, బిఎస్ఎన్ఎల్ వేణుగోపాల్, అక్బర్ పాషా, సత్యనారాయణ రెడ్డి, బాబు రావు, కాలనీ సభ్యులు, కమిటీ సభ్యులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఆదైర్యపడొద్దు అండగా ఉంటాం


ఇన్ముల్‌నర్వలో మిద్దె కిష్టయ్యకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**కొత్తూర్, డిసెంబర్ 8, ప్రభాతవార్త :**
కొత్తూర్ మండలం ఇన్ముల్‌నర్వ గ్రామంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పెంటనోళ్ల రవిని పలువురు ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్, టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ పార్టీల ప్రముఖులు హాజరై పరామర్శించారు. గతవారం రోజుల క్రితం తీవ్ర అస్వస్థకు గురై మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు మిద్దె కిష్టయ్య దశదిన కర్మకు విచ్చేసిన ఎమ్మార్పీఎస్ ప్రముఖులు ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా రవి కుటుంబీకులను పరామరి ్శంచి దైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మదిలేటి మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు చింటుబాబు, బక్కన్న, బక్క రవి, దర్శన్, కృష్ణ, రాజు, బాల్‌రాజ్, బీఎస్పీ ఎర్రోళ్ల జగన్, శంషాబాద్ సింగిల్ విండో చైర్మెన్ ఆశోక్, ఆనంద్, నర్సింలు, రంగాపూర్ నర్సింహ్మా, సంఘిగూడ శ్రీనివాస్, గణేష్ తదితరులు ఉన్నారు.

# కనుల పండువగా అయ్యప్పస్వామి మహాపడిపూజ


అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

**కొత్తూర్, డిసెంబర్ 8, ప్రభాతవార్త :**
కొత్తూర్ మండలంలోని కొడిచెర్ల గ్రామంలో అయ్యప్ప భక్తబృందం, ఎంపీటీసీ ఫోరం అధ్యక్షులు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురుస్వామి శ్రీశ్రీశ్రీ సతీష్ నాయర్ నేతృత్వంలో బుధవారం రాత్రి జరిగిన శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, ఎంపీపీ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి, అల్పాహార దాత మామిడి విక్రమ్‌రెడ్డి, టీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమానికి సుమారు రెండు వేల మంది అయ్యప్ప స్వాములు పాల్గొని అయ్యప్ప నామస్మరణం, భజన పాటలు, భక్తి గీతాలను అలపించారు. అనంతరం స్వాములకు, భక్తులకు అల్పాహార ప్రభు మామిడి విక్రమ్‌రెడ్డి చేత అల్పాహారాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... మాలధరణ చేసిన అయ్యప్ప భక్తులు కఠిన నియామాలతో దీక్ష చేస్తారు. ఉదయాష్టమ సంధ్యల్లో స్వామికి పూజలు చేస్తూ ఏకభుక్తం తింటూ 41రోజుల పాటు దీక్షను కొనసాగిస్తారు. కఠిన నియమాల్లో భిక్షకు అధిక ప్రాధాన్యత ఉందని వివరించారు. ఈకార్యక్రమంలో ధశరత్‌చారి, సర్పంచ్ వెంకట్‌రెడ్డి, టీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ, గ్రామ రైతు కోఆర్డినేటర్ పంపుల నరసింహ్మాగౌడ్, దన్నాడ జంగయ్యాయాదవ్, సురేందర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, వెంకటేష్‌గుప్తా, జంగయ్య యాదవ్, గురుస్వాములు బాతుక లక్ష్మయ్యాయాదవ్ స్వామి, బంటారం సుదర్శన్‌గౌడ్‌స్వామి, దేపల్లి ఆశోక్‌గౌడ్ స్వామి, మాదారం నరసింహ్మాగౌడ్‌స్వామి, హరిజీవన్‌స్వామి, వీరమల్లేష్‌స్వామి, సోమ్లానాయక్‌స్వామి, కుమార్‌గౌడ స్వామి, రాఘవేందర్‌గౌడ్‌స్వామి, నిరంజన్‌స్వామి, వార్డు సభ్యులు నవీన్, శ్రీధర్‌స్వామి, అయ ్యప్ప స్వాములు, భక్తులు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

## కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే


కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**బషీరాబాద్, డిసెంబరు 8, ప్రభాతవార్త:**
బషీరాబాద్ మండల కేంద్రంలో ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని గరువారం నాడు తాండూర్ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో మహిళలకు ఉపాధి అవకాశలను మెరుగుపర్చడం కోసం ఓ లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. మహిళ సంఘాలకు ప్రభుత్వం నుంచి విరివిగా రుణాలను మంజూరు చేయిస్తూ ఇప్పటికి వారి అభ్యున్నతికి దోహదపడుతున్నానని తెలిపారు. బషీరాబాద్ మండల మహిళలు స్వయం శక్తితో ఎదగాలని వారి కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలవాలనేదే ఎమ్మెల్యే లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో తెరాస పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు శకుంతల, మండల అధ్యక్షులు రాముకనాయక్, బషీరాబాద్ ఎంపిటిసి రేఖ, ఏఎంసి వైస్ చైర్మన్ రవీందర్ సింగ్, పిఎసిఎస్ చైర్మన్ వెంకట్రాం రెడ్డి తదితరులు ఉన్నారు.

## దైవభక్తితోనే మనిషికి ప్రశాంతత
**-చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య,**



**మొయినాబాద్, డిసెంబర్ 08, ప్రభాతవార్త :**
దైవభక్తితోనే మనిషికి ప్రశాంతత లభిస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. గురువారం మండలంలోని నక్కలపల్లి గ్రామంలో ఘణంగా అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహించారు, ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య హజరయ్యారు, గ్రామంలోని అయ్యప్పమాల దరించిన అయ్యప్పస్వాములు 40 రోజుల దీక్ష పూర్తిఅయిన సందర్బంగా గ్రామంలో మహ పడిపూజ నిర్వహించి శబరిమలై బయలుదేరారు, ఈ సందర్బంగా చేవెళ్ల ఎమ్మెల్యే మాట్లాడుతూ దైవభక్తితో మనిషికి ప్రశాంతత లభిస్తుందన్నారు, శబరిమలై బయలుదేరిన స్వాములకు తిరిగి క్షేమంగా రావాలని ఆ భగవంతుని కోరుతున్నామన్నారు, ఈ కార్యమ్రంలో అయ్యప్ప మాల ధరించిన స్వాముల కుటింబికులు, బంధువులు, స్నేహితులు, భక్తులు, గ్రామస్దులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు,

## ముఖ్యమంత్రి కెసిఆర్ సభకు భారీగా తరలిరావాలి
**-టీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు దప్పురాజు**

**మొయినాబాద్, డిసెంబర్08, ప్రభాతవార్త :**
తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యంత్రి కేసిఆర్ సభకు టీఆర్ఎస్ నాయకులు, కార్యాకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని మొయినాబాద్ మండల టీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యాక్షుడు గునుగుర్తి జేవంత్ మరియు సర్దానగర్ మార్కెట్ మాజి వైస్ చైర్మెన్ దప్పు రాజు పిలుపునిచ్చారు, గురువారం వారు వార్త పత్రికతో మాట్లాడుతూ నాలుగో విడత మెట్రోరైల్ పనుల కోసం శంకుస్దాపన వేయడానికి తెలంగాణ పోలీస్ అకాడమీ లో శుక్రవారం నిర్వహించే సభకు మండలంలోని టీఆర్ఎస్ నాయకులు, కార్యాకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు, శుక్రవారం ఉదయం 10 గంటలకు సీఎం సభ ప్రారంభమౌతుందని ప్రతి ఒక్కరు అక్కడికి ముందుగానే చేరుకోని తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతరం కృషిచేస్తున్న మన ముఖ్యమంత్రి కేసిఆర్‌ను ఘనంగా స్వాగతం చెప్పాల్సిన బాధ్యత మనందరికి ఉందన్నారు, మండలంలో ప్రతి గ్రామం నుండి పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.

## ఓం స్వామియే...శరణం అయ్యప్ప
**-స్వాములకు అన్నదానం చేసిన విజయ్ నాయక్**

**నందిగామ డిసెంబర్ 8, ప్రభాతవార్త :**
నందిగామ మండలం అయ్యప్ప దేవాలయంలో గురువారం టిఆర్ఎస్ సీనియర్ నేత ,తాటిగడ్డ తండాకు చెందిన జెట్టావత్ విజయ్ నాయక్-కవిత దంపతులు స్వాములకు అన్నదానం చేశారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గురుస్వాముల ఆశీస్సులు అందుకున్నారు. ఈ వేడుకల్లో అన్నదాన ప్రభువు కవిత-విజయ్ నాయక్ దంపతులను ఆలయ అభివృద్ధి కమిటీ పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా విజయ్ నాయక్ మాట్లాడుతూ...అయ్యప్ప దీక్షలో ఉన్న స్వాములకు అన్నదానం చేయడం తమ పూర్వజన్మ సుకృతంగా భావించారు. అయ్యప్ప ఆశీస్సులతో ప్రజలందరికి శాంతి, సౌభాగ్యాలు ,మంచి జరగాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు హరీజీవన్, సర్పంచ్ జెట్టావత్ రాజు నాయక్, మేకం రాజు, జెట్టావత్ లక్ష్మణ్ నాయక్, నాయకులు ఎం.రవిందర్ నాయక్, వార్డు సభ్యుడు జెట్టావత్ గణేష్ నాయక్, చించోటి కృష్ణ గౌడ్, పరుశరాం నాయక్, తేజస్వీని, రాంమోహన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.


అయ్యప్ప దేవాలయంలో అన ్నదాన ప్రభును సన్మానిస్తున్న ఆలయ కమిటీ స్వాములు

## ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా పోస్టర్ ఆవిష్కరణ



ఆమనగల్లులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు శివశంకర్

**ఆమనగల్లు, డిసెంబర్08, ప్రభాతవార్త:**
డిసెంబర్ 13 నుండి17 వరకు నిర్వహించతలపెట్టిన ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా సభల ప్రచార పోస్టర్‌ను గురువారం స్థానిక ఎస్ఎఫ్ఐ నాయకులు ఆవిష్కరించారు. పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు శివశంకర్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈసందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ భారత దేశంలో విద్యా విధానంలో సంస్కరణలు చేపట్టవలసిన అవసరం ఎంతైన ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక చర్యలతో విద్యార్థి లోకం తీరని అన్యాయానికి గురౌతున్నదన్నారు. ఈమేరకు ప్రజలు, విద్యార్థుల మేలుకొలుపును ఆకాంక్షిస్తూ డిసెంబర్ 13 నుండి 17వరకు ఎస్ఎఫ్ఐ ఆల్‌ఇండియా మహాసభలను నిర్వహిస్తుందని శివశంకర్ తెలిపారు. హైదరాబాద్ నగరంలోని ఉస్మానియా యూనివర్సిటీలో 2000 మంది ప్రతినిధులతో మహసభలు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. కార్య క్రమంలో మండల అధ్యక్షుడు మల్లేశ్, కార్యదర్శి అరుణ్, జిల్లా నాయకులు మల్లేశ్, మహేశ్, అదర్స్, ప్రశాంత్, పవన్, శ్రీకాంత్, దోని, దిలీప్ తదితరులు ఉన్నారు.

## 10న దేవాలయ ప్రారంభోత్సవం

**జిల్లెడు చౌదరిగూడ, డిసెంబర్ 8,(ప్రభాతవార్త):**
జిల్లెడు చౌదరిగూడ మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో నూతనంగ నిర్మించిన దేవాలయ ప్రారంబోత్సవ కార్యక్రమాలు 10వ తేది నుంచి 12వ తేది వరకు కొనసాగుతాయని గ్రామ పెద్దలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగ నూతన విగ్రహాల ప్రతీష్ఠాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజ కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు.

## ఆడబిడ్డల వివాహాలకు సహాయం

**కుల్కచర్ల డిసెంబర్ 08, ప్రభాతవార్త;**
పటేల్‌చెరువు తండా పరిదిలో ప్రతి ఆడబిడ్డల పెళ్లిల్లకు శాంతి కానుక అందజేస్తున్నామని సర్పంచ్ శాంతి తులసిరామ్ అన్నారు. గురువారం వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల పరిదిలోని పటేల్‌చెరువు గ్రామ పంచాయతీలో అనిత, అంబిక వివాహలకు గాను శాంతి కానుకగా 100 కిలోల సోనబియ్యం, 15 కిలోల మంచినూనె అందించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ సర్పంచ్‌గా ఎన్నికైన దగ్గర నుండి ఇచ్చిన ఎన్నికల హమిలో బాగంగా ప్రతి ఆడబిడ్డల వివాహలకు కానుక అందిస్తున్నామనిఇదే స్ఫూర్తితో ముందు ముందు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల మండల మైనారిటి సెల్ అద్యక్షుడు గఫూర్, మరియు తండా నాయకులు తదితరులు పాల్గొన్నారు.